241 'alli. Telugu Thalli Re. No. M. 3748.



| | | |
|---|---|---|
| సంపుటము 1. | చిత్తూరు: 1937 సం॥రం నవంబరు నెల. | సంచిక 6. |

తేటమాటల నీటగు - తెనుఁగుతల్లి
తేనెలొలుకు పల్కులుగల - తెనుఁగుతల్లి
తెలివి తేటలఁ గల్గించు - తెనుఁగుతల్లి
తెనుఁగు బిడ్డలు, కొలున్రఁడీ - తెనుఁగుతల్లి.


కుమారదేవ,
సంపాదకుఁడు.

A SINGH, at his Dt. Printing Works, Chittoor.
hed by KUMARADEVA, CHITTOOR.

# విషయసూచిక.

పేజీలు.


| | | | | |
|---|---|---|---|---|
| 1. | వేంకటేశ్వర స్తవము | ... | ... | 274 |
| 2. | ఆంధ్రరాష్ట్ర మహాసభా సమావేశము | | ... | 275 |
| 3. | మంథానము | ... ... | ... | 277 |
| 4. | కుమార సంభవము | ... | ... | 281 |
| 5. | గంటలు నిర్ణయించు పద్ధతి | ... | ... | 285 |
| 6. | సంగ్రహ ఆంధ్ర వాఙ్మయ చరిత్రము | | ... | 287 |
| 7. | మధుపానము | ... ... | ... | 290 |
| 8. | ఆశీస్సు | ... ... | ... | 293 |
| 9. | కన్ఫ్యూషియస్ ఋషి | ... | ... | 294 |
| 10. | అనుభూతి | ... ... | ... | 303 |
| 11. | రంగులరాట్నము | ... ... | ... | 304 |
| 12. | నోటీసు | ... ... | ... | 306 |
| 13. | నవయువకుఁడు | ... ... | ... | 308 |
| 14. | శ్రీ. శే. అర్మగస్వాములు (కొండకుప్పం) | | ... | 310 |
| 15. | ఋతుచిహ్నము | ... ... | ... | 312 |
| 16. | చిత్రప్రశ్నలు | ... ... | ... | 315 |
| 17. | తెనుఁగుతల్లి పోటీపరీక్ష, నెం 1 | ... | ... | 320 |
| 18. | కర్షకప్రబోధము | ... ... | ... | 321 |
| 19. | నెలదినములు | ... ... | ... | 323 |
| 20. | ఆరోగ్యవిజ్ఞానము, లోకజ్ఞానము | ... | ... | 326 |
| 21. | నెల పంచాంగము | ... | ... | 328 |




# తెనుఁగుతల్లి.

సమస్త విజ్ఞాన దాయకములగు విషయములఁ జర్చించు
సచిత్ర మాసపత్రిక.

| | | | | |
|---|---|---|---|---|
| సంస్థాపకులు | | రూ. | 116—0—0 | అంతకుపై. |
| సముద్ధారకులు | | ,, | 50—0—0 | ,, |
| సంరక్షకులు | | ,, | 25—0—0 | ,, |
| సంస్కారకులు | | ,, | 10—0—0 | ,, |
| సభ్యులు | సం॥కు | ,, | 5—0—0 | ,, |
| చందాదారులు | ,, | ,, | 1—0—0 | |

చిరునామా:— మేనేజరు,

"తెనుఁగుతల్లి" ఆఫీసు, చిత్తూరు.

# వేంకటేశ్వర స్తవము.

కె. కృష్ణరావుగారు.

ఉ॥ పారసమల్లికావకుళ - చంపకపుష్పలలంతికామణీ
హారకిరీటభూషణచ - యాంచితతావక దివ్యమంగళా
కారవిలోకనామృత సు - ఖంబునఁజొక్కి మనంబు దేనిని
గోరదునీకృపారసము - గూర్పుముచాలును వేంకటేశ్వరా!॥

తే-గీ॥ నీమహాత్మ్యకంజమునఁగ్రాలు - నెనరుతేనె
గొఱఁతవడకుండ భక్తాళి - గ్రోలుకొఱకు
నొంటినిల్తువు కొండపై - నుపిదమూసి
శ్రితజనప్రేమ మెంతన - శ్రీనివాస!

తే-గీ॥ పల్లవారుణకోమల - పాదకలన
శిలను జెలువఁజేయుటదేమి - చిత్రమనుచు
శిలగఁజెన్నొందు సంఘ్రులఁ - దంచుమాత్రఁ
[illegible] ముక్తికాంతను - శ్రీనివాస !

-600 008.

# ఆంధ్రరాష్ట్ర మహాసభా సమావేశము.

---

అక్టోబరు 25, 26, 27, తేదులలో బెజవాడయందు బ్రహ్మాండమగు సభలు జరిగినవి. రాయలసీమ వాసులను గొందఱిని పిలిచికొనివెళ్లి అసాధారణ మన్ననలఁదనిపి ఉత్తరాంధ్రులు తమపని నెఱవేరినదని తమ్ముఁదామభినందించుకొని మురిసిరి. ఏనుఁగుబిడ్డకు వెలగపండును జూపినట్లు సమయోచితముగ ననేక వాగ్దానములుఁజేసిరి;— ధన్యులు.

"ఎప్పటికెయ్యది ప్రస్తుత
మప్పటికామాటలాడి యన్యులమనముల్
నొప్పింపక తానొవ్వక
తప్పించుక తిరుగువారు".


ఆంధ్రరాష్ట్రము మనకందఱకుఁగావలయునని యున్నది కాని, ఇదివఱకు రాయలనాఁటి ప్రజల విరసించి యాధఃకరించి ద్వేషబీజముల మహావృక్షము లగునంతవఱకుఁ బెంచి పెద్దసేసి యుండిన సంగతి ఏనుఁగలనెక్కి యూరేగిన నాయకులు మఱచినారనిన నది వారి దోష మెట్లగును? మహాభారతము శాంతిపర్వమునఁ దిక్కయజ్వ

"నెయ్యము సెడినను మాటల
తియ్యఁదనమువట్టి పగమదిఁ మరచినఁజా
వయ్యెం జేటయ్యెఁగలఁక
యయ్యె నొకటిమాఁడుఁగాక యదిమేలగునే?

పగయుఁ గల్గెనేని పాయునె, గూఢమై
ప్రాణనగ్ని యున్న మాడ్కి నుండుఁ
గాననమ్మఁబోల కాలాంతరంబున
నైనఁ జెడును సందియంబువలదు॥

వినుచల్లని మాటలలో
మునిఁగియులుక గుబ్బతీఁలు సముద్రజలములో
ననయుండి యూఱకెప్పుడు
గనగనము బాడబాగ్ని కరణి నరేంద్రా''

అని రాజనీతిని ప్రసాదియున్నారు. ఇది పరస్పరము "ఉత్తరాదివారును దక్షిణాదివారును'' గమనింపవలసియున్నది. ఆంధ్రరాష్ట్రము వచ్చినదనుకొందము. జనసంఖ్య విషయమునను, ఆదాయముపట్లను ఉత్తరాంధ్రులు పైచేయి గైకొనక తప్పదు. ఈ రెండును లేని రాయలనాఁడువారు తమతో సమభాగము ననుభవించుటయనిన నది ఉత్తరాదివారికి మనసొప్పదు. అందువలన మరల మరల సంతతకలహము లేర్పడక తీఱదు. అట్టి "ఇంటిలోనిపోరు'' దప్పించుకొను మార్గములేదు. బేలింపులకు బేలుపోయిన మననాయకు లీవిషయమును ముందాలోచన జేయవలెను. కీడెంచి మేలెంచవలయునను సూత్రము మనకిప్పట్టునఁ గొలికిపూస.



# మంథానము.

ఇంద్రుఁడు గౌతమపత్నిం జెఱుపఁగోడియై కూసి, యామె పాతి
వ్రత్యము నట్టేటఁగలిపి, తత్ఫలితముగ ఒడలెల్ల యోనులు సంపాదించుకొని
యెను. వృషణములు పోగొట్టుకొని అశ్వినీదేవతలచే మేషాండముల నతి
కించుకొనియెనని యొక చోటఁగలదు. ఒడలెల్ల యోనులగుటగాని, వృషణ

హీనుఁడగుటగాని, శాపవశమునఁగాదనియు సుఖరోగముచే ననియు మా వాదము. అది స్వభావసిద్ధమును ఇతఁడు సర్వదా సర్వథా వ్యభిచారి. వ్యభిచారిణీసమాజమునకు నాయకుఁడు. రంభాదులే యితనికి కార్య సాధనములు. వ్యభిచారమే ముఖ్యవృత్తియై యవి వేదోక్తములనిపించి ప్రభువుల నోళ్లుగట్టి యాగాదులమూలమున విచ్చలవిడిగా మిండతీకము చేయుచుండు వారికిట్టి వాఁడు గాక మఱియొకఁడు దేవరాజ్య పట్టాభిషిక్తుఁడైనచో తమ యాటలు సాగునా? పూర్వదేవతలయొద్ద తమ యసహ్యకార్యములు సాగక పోవుటచేతనే వారిని పదభ్రష్టులఁ గావించుటయు, ఆస్థానమున అపర దేవతల నిలుపుటయుం మునులకు తప్పని సరియైనది.

ఒకరాజ్యమున కధికారియగు వాని కెన్ని సుగుణములుండ వలయునో అందొక్కటియైన నింద్రునకున్నదా?

మిండతీకములలో నింద్రుఁడందెవేసినచేయి. మాయలలోనందమా? అతని మించినవారులేరు. తమమాయలన్నియు వేదోక్తములనియు రాక్షసుల కార్యములన్నియు వేదబాహ్యములనియు కపటయుక్తులనియు లూలా మాలపుమాటలచే లోకము నోరుమూయుటకు తమకు ఫీజులేని వకీళ్లు మును లుండఁగా నీ చిన్నదేవతల కేమికొదువ? ఏదితప్పు? ఏదిఅయుక్తము? యెయ్యదకార్యము? అన్నియు వేదోక్తములే శాస్త్ర సమ్మతములే.

అసూయలో నైతమగ్రతాంబూలముగొన నర్హుఁడింద్రుఁడే. యజ్ఞ విధ్వంసకులని రాక్షసుల నగడుపఱచిన ఋషులు పృథుని సగరుని యజ్ఞ ములను మఱియు నెందఱివో యజ్ఞములను పాడుచేసిన క్రతుభుక్ప్రభు నేల అగడెత్తింపలేదు? స్వార్థపరత్వమున మఘవుని చెప్ప మఱియొకరిని చెప్ప వలయును. తననెత్తికి పిడుగులై వత్తురని రాజుల యజ్ఞములను వినాశ మొందించుటయు రాక్షసులతపస్సుల పాడొనరించుటయు శతక్రతుని నిత్య కృత్యములు. మొదటియజ్ఞ విధ్వంసకుఁడు శివుఁడు. అతఁడు రాక్షసపక్షపాతి. అట్లయ్యును ఎల్లకాపరిగానుండు వాఁడు గావున నతని నగడెత్తించిన తమకే పెక్కుచిక్కులు కలుగుననియే యతని కార్యములను ధర్మయుక్త ములని సమర్థించుచు వచ్చిరి.

ఇంద్రుఁడు మహాశూరుఁడు కావున దేవరాజ్యార్హుఁడందమా? ఏ రాక్షస ప్రభునొద్ద నతఁడోడకుండినది? దినగండము నూరేండ్లాయు

వన్నట్టింద్రుని వైభవము సర్వకాలములయందు సుస్థిరము కాకయుండెడిది. ఒక్కొక్క రాక్షసుఁడు దండెత్తివచ్చి దేవతల నడవులకుఁ బాఱఁదోలి స్వరాజ్యమైన స్వారాజ్యమును గైకొన్నపుడు మునులు నింద్రుఁడు చేరి “మాయాగాదికార్యములెల్ల విధ్వంసమయ్యెను. దేవరాజ్యము పూర్వ దేవతల యధీనమయ్యెను. లోకము పాడుపడియెను.” అని బ్రహ్మతో మొఱవిడుటయు అతఁడు వారిని విష్ణువుపాలికిఁ గొనిపోయి మొఱ్ఱపెట్టి మొత్తుకొనుటయు అతఁడొక తంత్రమువన్ని ఆసత్కాలమునందు నైతము తూగధర్మనను వీడని యమాయికులగు పుణ్యజనుల నంత మొందించి దేవతల యాస్థాస్థానమున నిలుపుటయు మాటికిమాటికి జరుగుచుండునని మున్నే చెప్పియున్నారము. వీరివలె వారును అధర్మమార్గమున సంచరించు వారై యుండినచో దేవతలేనాఁడో పేరులేక నశించియుండుగాక. పంచముల మాయలు అమాయికుల యొద్దనే గదా సర్వతోముఖముగఁ జెల్లుబడి యగుచుండును.

ఇట్టి పరమ ఖూరుఁడు, పాతివ్రత్య విధ్వంసకుఁడు తపోవిఘ్నకారి అక్రమ ప్రవర్తకుఁడే దేవరాజ్యమునకు సర్వవిధముల నర్హుఁడు కావలయు. పరీక్షించి యున్నత పదవులీయ నిట్టికార్యము లొనర్చె ననుకొందమన్నను పురాణము లట్లు చెప్పుటలేదు. అహల్యను కేవల కామియై మోసగించి చెఱిచెను. రాక్షసుల తపస్సులే కాక విశ్వామిత్రాది మహర్షుల తపస్సులను కూడ తన కొంపకేదో ముప్పువచ్చునను భయముచే స్వార్థపరుఁడై చెఱుపఁ బూనెను.

ఎన్ని తప్పులు చేసినను ఎంతనీచ ప్రవర్తకుఁడైనను ఇంతకంటె తమ కనుకూలుఁడు, ఆత్మోన్నతి వీడినవాఁడు, చపలుఁడు, కీలుబొమ్మ దొరకఁడనియే ఋషులితనినే దేవరాజ్యపదమున పడరానిపాటులుపడి నిలువఁబెట్టుకొనుచుండిరి. ఒకప్పుడేదోతిరస్కార భావమునఁ బ్రవర్తించెననిమునులింద్రుని పదభ్రష్టునిగావించి యాచోట నహుషుని నిలిపిరి. వారి యసహ్యావర్తనములు కొన్నాళ్లలోనే నహుషునకు వెగటుపుట్టించెను. అంతనతఁడు వారి చర్యల నిర్భయుఁడై ఖండింపఁ బూనఁగా నతనిపై లేనిపోని యపనిందలు మోపి మునులతనిని పదభ్రష్టుని గావించిరి.

నహుషుఁడు శచిని గోరినది నిజమా? ఇంద్రుఁడు పదచ్యుతుఁడై యడవులబడి తిరుగుచున్నపుడు వానిభార్య వానితోఁ దిరుగక యింటు

సుఖించుచుండునా? ఉండినచో నామె పతివ్రతలలో మేలుబంతి యని పించుకొనునా? ఇంద్రుని వెంట నడవులలో సంచరించుచున్న శచిని నహుషుఁడు గోరుట యసంభవము. ఇంద్రపదము నధిష్ఠించినవాని మనస్సంత నీచకృత్యమునకుఁ జొచ్చునా? లేక అరుడవి నందిన వారికెల్ల నట్టి బుద్ధియే కలుగునా?

మునులచే పల్లకి మోయించెనని యొకచోటను అగస్త్యుని గాంచి పరిహాసముకై త్రాటిని జూపి పామని బెదరించెనని యొకచోటను గలదు విచారింప నీరెంతు నేదియు నిజముకాదు. నూఱు యాగిలు చేసి ఋషులకు సర్వస్వముదానముచేసి వారినిసంపూర్ణసంతుష్టులఁగావించిన నహుషుఁడు, ఇంద్రపదవి వచ్చినంతనే మఱునాఁడే కన్నుగానక ముందు వెనుకలు మఱచి తలకు చెప్పులడిగెడు అల్పుని చందమున మునులచే పల్లకి మోయింపఁ గోరునా? మతియున్న మానవునకిది విశ్వాసార్హమగునా?

అగస్త్యుఁడు మహామహిమా సంపన్నుఁడని యెఱుఁగకుండునంత బాలకుఁడా నహుషుఁడు? ఋషులే దేవతలకుసైత మధికారులని నమ్మి వారిమూలముననే క్రతుశతము కావించిన ప్రభువు మునుల మహిమల నెఱుఁగనివాఁ డనుటుకంటె ప్రపంచ విరుద్ధము వేఱొండుండునా? అందును లోకవిఖ్యాత మహిమాసంపన్నుఁడగు అగస్త్యునే గేలిచేసెననుట యవిచారమూలకముకాదా? తాము గీచినగీఁతయే వేదము. తమ వాక్యములను కాదనువాఁడే పతితుఁడు, పాపి, పాషండుఁడు అనిశాసించిన దురహంకార భూయిష్ఠులగువారి వాక్యము లిట్లుగాక మఱెట్లుండును? తప్పొప్పుల విమర్శించుట కెవ్వరికి నధికారము లేదని చండశాసనము కావించియున్నప్పుడు వారేది యెట్లు వ్రాసికొన్ననేమి? నాఁడుగాకున్న నాలుగుతరములు దాఁటి నపిమ్మటనైన వెఱ్ఱిలోకము నమ్మకుండునా ?

నహుషుఁడు తమ కనుకూలుఁడై యుండని కతమున లోకుల కనులు గప్పఁ గొన్ని యపనిందలు కల్పించి పామపై పడియుండుమనిశపించి నిదురించునపుడు పామును గొట్టినట్లేకొట్టి చంపివైచిరి. వాఁడెట్టివాఁడైనను ఇంద్రునివంటి కీలుబొమ్మ మఱియొకఁడు దొరకఁడని యతనినే యథాస్థానమున నిల్పిరి.

# కుమార సంభవము. (అనువృత్తము)

పూఁతలపట్టు శ్రీరాములు రెడ్డి.

## తృతీయ సర్గము.

తే-గీ॥ మదన! నీకుసంగాతి యీ - మాధవుండు
చెప్పకయె వచ్చుఁదోడ, నేఁ - జెప్ప నేల?
అనలునకుఁదోడుపడుమని - యనిలునకును
నెవ్వఁడెప్పుడా దేశించు - నిద్ధవీర్య!. ౨౧

తే-గీ॥ అనిన నట్లగుఁగాకని - యసమశరుఁడు
విభునియాజ్ఞ నౌదల శేష - విధినిదాల్చి,
నడచె నైరావతాస్ఫాల - నమున బిరుసు
గలుగుకరమున నింద్రుండు - గారవింప. ౨౨

తే-గీ॥ శంకతో వసంతుఁడు రతి - జరుగవెంట
దేహమసువులు దీఱినఁ - దీఱుఁగాక,
దేవకార్యము తప్పక - దీర్తుననుచు
మనసిజుం డీశ్వరాశ్రమ-మునకుఁజనియె. ౨౩

తే-గీ॥ అవ్వనంబు సంయము - లైనమునుల
తపములకుఁ బ్రతికూల వ - ర్తనమువాఁడు,
మదనునభిమాన భూతుండు - మాధవుండు
పెల్లుగా నాత్మగుణము వ - ర్తిల్లఁజేసె. ౨౪

తే-గీ॥ తీక్ష్ణకరుఁడు కాలంబు న - తిక్రమించి
తాఁ గుబేర పాలిత దిశం - దమినిఁజేరఁ
గడఁగ దక్షిణ దిఙ్ముఖ - గంధవహము
వఱలెనపుడు వ్యళీక ని - శ్వాసమునలె. ౨౫

తే-గీ॥ బోదెనుండి చివుళ్లు పు - వ్వులును బూచె
నల యశోకము, రవళించు - నందియలను
దనుకు సుందరి పాద తా - డనము సుంత
యైనఁ గోరదయ్యెను వసం - తాగమమున. ౨౬

తే-గీ॥ చివురు మొలకల గఱులుగా - నవరసాల
సూన బాణంబుచేసి య - ద్దాని మీఁద

నళుల పఙ్క్తిని మదను, నా - మాత్సరములు
గాఁగనుంచె వసంతుఁడు - క్రమఘణీతి. ౨౭

తే-గీ॥ కర్ణికారంబు వన్నెచేఁ - గడిమి నొంది
తావిలేమిని మదికిఁ జీఁ - దఱయొ గూర్చు
నరయఁ దఱచుగ సకల గు - ణాస్పదముగ
నొక్కవస్తువు సృజియింప - నొల్లఁడజుఁడు. ౨౮

తే-గీ॥ విరియమిని లేఁత చందురు - కరణి వక్ర
ములును మిక్కిలి యెఱుపులై - యలరు మోదు
గలు వసంతుఁ జేరిన వన - స్థలుల కపుడు
గలుగు గోటి నొక్కులఁబోలె - వెలయుచుండె. ౨౯

తే-గీ॥ అళుల యంటను కాటుక - వలనఁ జిత్ర
మైన తిలకంబు మొగమునఁ - గాన మావి
చిగురు మోవి లేఁతయరుణు - చెలువురక్తి
నలరఁగ నేసికొనె నప్పు - డామనిసిరి. ౩౦

తే-గీ॥ ప్రేంకణపుఁ బూఁదుమారముల్ - మృగవిలోచ
నములరాలఁగఁ గనులుగా - నక మదమునఁ
బైర కెదురుగ నవి మర్మ - రాకవములఁ
బండుటాకులు రాలున - వ్యసులఁదిరిగె. ౩౧

తే-గీ॥ గండుఁ గోయిలల్ మావిమొ - క్కలను మెక్కి
వగరు గల్గు కంఠములఁ - బలుకసాగె
నవియ మానినీమానము - లవియఁజేయు
మన్మథుని పలుకులై యొప్పె - మాధవమున. ౩౨

తే-గీ॥ ఇవము దొలఁగుటచే నొవ్వి - యొడలినట్టి
మోవు లాపాండురంబులౌ - మోములుగల
కింపురుష వనితలకు జ - నింపఁ దొడఁగె
వివిధపత్త్రి రేఖలయందు - స్వేద జలము. ౩౩

తే-గీ॥ ఇటు, లదాటున మధుని వి - జృంభణమున
స్థాణువాశ్రమ వాసులౌ - తాపసులకుఁ
జిత్తములు వికృతిం బొందఁ - జిట్టచివర
కెట్టులో యాఁపికొని రొక్క - పట్టుదలను. ౩౪

తే-గీ॥ పూల విల్లెక్కు-పెట్టి పూఁ - బోఁడిఁ గూడి
భవుని నెఱవునకుం జిత్త - భవుఁడు రాఁగ
ద్వంద్వములు కాష్ఠగతినొంది - తమకమునను
భావములను గ్రియలచేత - బయలు వఱచె. ౩౫

తే-గీ॥ ఒక్క పూఁగోరలోఁ దేనె - నువిదకిచ్చి
మిగతఁ దాఁ ద్రావె గండు తు - మ్మెద యొకండు
స్పర్శసుఖమున ఱెప్పలు - వ్రాల్చు మృగిని
కృష్ణసారము గోఁకెను - శృంగమునను. ౩౬

తే-గీ॥ ప్రేమ చేఁ గరేణువు పద్మ - రేణు గంధ
మైన పుక్కిటి జలమును - దాని కొసఁగె
సగము నమలిన బిసమును - జాయ కిచ్చి
గారవించెను మిగుల జ - క్కవయొకండు. ౩౭

తే-గీ॥ శ్రమ కణంబుల నించుక - జాఱె నట్టి
పత్త్రరేఖలఁ బుష్పాస - వమున నుడియు
కనుల శోభిలి వాడెడు - కాంతమోము
చుంబనము గొనెఁ గింపురు - షుం డొకండు. ౩౮

తే-గీ॥ నిండు పుష్ప గుచ్ఛములు పా - లిండ్లుగను
వెలయు చివుళు లందములైన - పెదవులుగను
కలిగి సొంపొందు తీఁగబో - టులను జెట్లు
ప్రేమ శాఖాభుజములఁ బ - రిష్వజించె. ౩౯

తే-గీ॥ అట్టివేళ నచ్చరల గే - యముల వినియు
భర్గుఁ డాత్మను సంధాన - పరుఁడ యయ్యెఁ
హృదయ నిగ్రహులకు విఘ్న - బృందము దమ
సంయమంబును భంగింపఁ - జాలవెన్న. ౪౦

తే-గీ॥ తీఁగ యింటి గడప నంది - తివిరి నిలిచి
ఎడమచేత బంగరుబెత్త - మెసఁగఁబట్టి
తర్జనిని నోరుమూయుచుఁ - దర్జనముల
నల్లరిం జేయ కుండఁ దా - నడచుచుండె. ౪౧

తే-గీ॥ కదల కుండెను జెట్లు, తు - మ్మెదలు తిరుగ
వండజములు కూయవు; మృగ - తండములును

సంచరింపవు; నందికే - శ్వరుని యాజ్ఞ
నవ్వనంబెల్లఁ జిత్తరు - వట్టు లొప్పె. ౪౨

తే. గీ॥ పయనమందు జుక్కయెదురు - పట్టు దొలఁగు
పగిది నందికేశ్వరు దృష్టి - పథము దొలఁగి
చెంతనున్నట్టి సురపొన్న - చెట్టునెక్కి
శూలి ధ్యానాస్పదముఁజొచ్చె - సుమశరుండు ౪౩

తే. గీ॥ దేవదారువేదికపయి - ద్వీపి చర్మ
మునను గూరుచుండి సమాధి - ముద్రఁబూని
యున్న ముక్కంటి హరుని నా - సన్నకాలు
పతనుఁడగు సుతనుండు భా - వజుఁడు గాంచె. ౪౪

తే. గీ॥ పైసగము దేహమును జలిం - పక కదించి
రెండు భుజములఁ గుదియించి - రెండుకేలు
జెల్లకిల విరిదామర - వితమున నొడి
నడుమ నిడికొని వీరాస - నమున నుండి. ౪౫

తే. గీ॥ అహులచే జడ లెగఁగట్టి - యక్షమాల
రెండుపేటలఁ జెవియందు - వ్రేలవైచి
కంఠకాంతిచే మిక్కలి - కట్టియగుచు
ముడులు గలయుట్టితోలు క - ప్పుగలవాని. ౪౬

తే. గీ॥ నిశ్చలోగ్ర తారకలు కొం - చియము వెలుఁగ
బొమలు పక్ష్మలంబులు నిశ్చ - లములు గాఁగఁ
గ్రిందికిం బ్రసరించెడు - కిరణములను
గంటి చూపుల నాసికా - గ్రమున నిలిపి, ౪౭

తే. గీ॥ వాయువుల లోనఁ గట్టుట - వలన నపుడు
వానపడిలేని మేఘంబు - వలె దనర్చి
యలలు లేని తటాకంపు - టనువుగలిగి
పయిరలేమి నిష్కంప దీ - పంబువోలె. ౪౮

తే. గీ॥ పునుక కంటి మార్గంబును - బొంది యుబ్బి
వలనలేచిన కాంతి మొ - ల్కల వలనను
దూఁటి పొఁగుకంటె నతిమృ - దుత్వమైన
బాల చంద్రు శోభను నల్ల - వలచు చుండ. ౪౯

# గంటలు నిర్ణయించు పద్ధతి.

విద్వాన్ - మునిరత్నపిళ్ళగారు.

"కాష్ఠమును పదునాఱు భా - గములుచేసి
యెండలోఁ బెట్టి సమకోణ - ముండునటుల
పుల్లనీడ పరుండిన - పుల్లకొనకుఁ
దగులునట్టుగ సరిచేయఁ - దథ్యముగను
నిలుచు పుల్లభాగంబు తా - నిజఘటికలు"

భూమి తన్నుదాను ఒకసారి చుట్టుకొనుటకు 24 గంటలగుచున్నట్లందఱెఱుఁగుదురు గదా! దీనినేపూర్వులు సూర్యుఁడు 24 గంటలలో (60 గడియలలో) 360 డిగ్రీలుగల భూమిని ఒకసారి ప్రయాణము చేయుచున్నట్లుచెప్పిరి. కావున 90 డిగ్రీల ప్రయాణమునకు 6 గంటల కాలమగుచున్నది.

దీనినిబట్టి పూర్వులు పై నుదహరించిన విధమున గడియలు తెలిసికొనుచుండిరి.

ఎట్లన? 16 అంగుళముల నిడివిగల యొకపుల్లను గై కొనవలయును. ఒక్కొక్క అంగుళమును 12 భాగములుగాఁ జేసికొన్నచో మిగులమంచిది. పగలు 12 గంటలు కాకమునుపు అనఁగాఁ బూర్వాహ్ణమున నెన్ని గంటలయినవో తెలిసికొనవలయునన్న పైఁగనిన పుల్లను ఎండకాయుచున్న సమప్రదేశమునఁ బెట్టి వంచవలయును. అప్పుడు 16 అంగుళముల పుల్లలో కొంతభాగము నిలిచియుండును. కొంతభాగము నేలపైఁ బరుండియుండును. పరుండియున్న భాగముయొక్క కొనకు నిలుచున్న భాగముయొక్క నీడ సమముగానుండునట్లును 90 డిగ్రీల కోణమేర్పడునట్లును కొంత ముందు వెనుకలుగా

వంచిచూచి సరిపఱచుకొనవలయును. తర్వాత నిలుచున్న భాగమును కొలిచి చూచుకొనవలయును. ఎన్ని అంగుళము లో అన్ని గడియలని తెలియును. అంగుళములోనివి భాగమొక్కొక్కటియు రెండునిమిషములని తెలియనగును. కావున సులభముగా గంటలు చెప్పవచ్చును. ఉదాహరణము 6 అంగుళములు నేలపైనున్న యెడల 10 అంగుళములు నిలబడియుండును గదా! అప్పుడు 10 గడియల ప్రొద్దెక్కినదని తెలియనగును. 10 గడియలను గంటలుగా మార్చుకొనినచో 4 గంటలగును కావున ఉదయాది 4 గంటలు అనగా 6 + 4=10 కాఁబట్టి 10 గంటలని తెలిసికొనవచ్చును. పగలు 12 గంటలకుఁబిదప (అపరాహ్ణమున) నైనచో 10 గడియలు ప్రొద్దున్నదని తెలియుటచే 6—4=2 గంటలయినవని గ్రహించవలయును.

మఱియొక యుదాహరణము:—నిలబడినపుల్ల కొలత 8 అంగుళములు 7 విభాగములున్నవను కొందము. 8 గడియలకుపైన 14 నిమిషములుకదా! 8 గడియలును 192 నిమిషములు కావున 192 + 14=206 నిమిషములు అయినవి. అనగా 3 గంటలు 26 నిమిషములు సూర్యోదయకాలము 6 గంటలను చేర్చగా 9 గంటలు 26 నిమిషములయినవని యేర్పడుచున్నది. సాయంకాలమున నిట్టికొలఁత యేర్పడినయెడల 6 గంటలలో 3-26 పోగా 2 గంటలు 34 నిమిషములయినవని తెలియనగును. ఈపద్ధతి యెండకాయుచున్నప్పుడే యుపయోగపడునని ప్రాజ్ఞులు గ్రహింతురుగాక. గడియారములేని ప్రదేశములయందీపద్ధతి మిక్కిలి సహకారియైయుండఁగలదు. సొంతగడియారము నిలిచిపోయినప్పుడు పైవిధమునగంటలను తెలిసికొని గడియారమును సరిచేసికొనుటకును పనికివచ్చును.

# సంగ్రహ ఆంధ్ర వాఙ్మయ చరిత్రము.

మో. చలపతిరావుగారు.

మనము ఆంధ్రులము; మనభాష ఆంధ్రభాష; మనదేశము ఆంధ్రదేశము. జాతి భాష దేశములకు నొకే పేరుండుటచే వీనిలో నొకదాని కొకదానికి సంబంధముండియేతీరును. జాతినిర్మాణమునకు భాషగాని దేశముగాని ప్రధానములు కావు. తల్లిదండ్రుల రక్తమే ప్రధానము; ఏలన నొక ఆంధ్రుఁడు ఇంగ్లాండు దేశమునకు వెళ్లి యొక ఆంగ్లేయయువతిని పెండ్లాడి కన్నబిడ్డఁ డాంధ్రుఁడగునా? ఆంధ్ర దంపతులు పరదేశములలో నివసించుచున్నను వారికి గలిగిన పుత్రులు ముమ్మాటికి ఆంధ్రులే. ఆంధ్రులలో చతుర్వర్ణముల వారున్నారు. కావున మనభాషకుగాని దేశమునకుగాని జాతినిబట్టి పేరు రాలేదని తెలియు చున్నది. కావున మొట్టమొదట దేశమును బట్టి భాషకు, భాషనుబట్టి జాతికి పేరు వచ్చియుండును. దేశమునకీపేరు ఎట్లు వచ్చినది? ఈవిషయమున పలువురు పలువిధముల అభిప్రాయ పడుచున్నారు. భాగవత నవమస్కంధమునందు ఆంధ్రుడను రాజొక్కఁడుండెను. ఆతఁడు పాలించినదేశము ఆంధ్రదేశమని పిలువబడినట్లున్నది. కావున ఆదేశమున మాట్లాడు భాషకాంధ్ర భాషయనియు ఆభాషమాట్లాడు వారు ఆంధ్రులనియు కొందఱి భ్రమ. రామానుజులవారు ఆంధ్రదేశమునకు నిర్దేశించిన ప్రదేశమని యర్థము కావున దండకారణ్య సమన్విత ప్రదేశము ఆంధ్రదేశమనియు అందు నివసించువారు ఆంధ్రులనియు వారి భాష ఆంధ్రమనియు నభిప్రాయ పడుచున్నారు.

ఆంధ్ర రాజ్యము క్రీ. పూ 300 సంవత్సరముల ప్రాంతమునుండి నత్యున్నతదశ యందున్నట్లు మెగాస్తనీసు రచనల వలన తెలియుచున్నది. కాని మనకు క్రీ శె. 11-వ శతాబ్దము వాఁడగు నన్నయకు పూర్వపు కవిత్వము లభింపమిచే అతని పూర్వ మాంధ్రలిపి యుండియుండునా? లిపియేలేకున్న నన్నయ్యకునన్ని కట్టుదిట్టములతో నంత నిర్దుష్టముగా నూతనముగా గ్రంథరచన సాధ్యపడియుండదు. కావున నన్నయ పూర్వము ఆంధ్రభాషలో ననేకగ్రంథము లుండియే తీరును. హిందూదేశమున నతి ప్రాచీనములగు అశోకుని శాసనములందలి లిపికిని తెలుగు లిపికిని సంబంధ

మున్నట్లు పాశ్చాత్యులే యంగీకరించి యున్నారు. అశోకుఁడు తన శాసనములు తెలుఁగులోనే వ్రాయించెనేమో! నన్నయకు పూర్వ గ్రంథములు ఏమైనవి? మన దేశము ఆఱవ శతాబ్దమునకు పూర్వము బౌద్ధజైనాక్రాంతమై యుండినపుడు ఆంధ్రమున బౌద్ధజైన వాఙ్మయములు విస్తరిల్లి యుండవచ్చును. తరువాత రాజ్యాధికారులైన చాళుక్యులు బ్రాహ్మణ మతస్థులు. వారు బౌద్ధజైన వాఙ్మయములను ప్రోత్సహింపక పోవుటయే కాక రాజరాజ నరేంద్రుని కాలమున వారి మతవాఙ్మయాభివృద్ధికై, అప్పటికే సన్నగిల్లి పోయిన బౌద్ధజైన వాఙ్మయములను అడుగంటు నాశన మొనర్చి నన్నయ్యను భారత ఆంధ్రీకారమునకు ప్రోత్సహించి యుండురు.

ఒక్కొక్క కాలమునందు ప్రబలిన ఆచారములు, ఆలోచనలును వాఙ్మయముయొక్క విధానములను నిర్ణయించుచుండును. జాతీయ జీవనమున కలుగు మార్పుల కనుగుణముగా నొక్కొక్కప్పుడు కవిత యందలి రుచియు మాఱుచుండును. కావున నొక్కొక్క విధమైన కావ్యము ప్రాముఖ్యములోనికి వచ్చుచుండును.

ప్రస్తుతాంధ్ర వాఙ్మయమున ప్రథమ యుగము ఆంధ్రీకరణ యుగము. నన్నయాదులు కేవల భాషాంతరీకరణ మొనర్పక ఆంధ్రీకారమున పెక్కుమార్పులు కల్పించిరి.

ప్రబంధములందు కవులొక చిన్నకథను తీసికొని పెంచి పెద్ద కావ్యముగాఁ జేయుటకు మొదలిడిరి. నాచన సోమనాథుఁడు ఉత్తరహరివంశముతోడను శ్రీనాథుఁడు శృంగారనైషధము తోడను, ఆంధ్ర వాఙ్మయమున ప్రబంధ బీజములు చల్లిరి. క్రమముగా అల్లసాని పెద్దన తన మను చరిత్రముతో ప్రబంధరాజము నంకురింపజేసెను. తరువాత రామరాజ భూషణుఁడు తన వసుచరిత్రమున కొన్ని క్రొత్తపోకడలు పోయెను పిమ్మట పింగళి సూరనార్యుఁడు తన కళాపూర్ణోదయము ప్రభావతీ ప్రద్యుమ్నములతో ప్రబంధ శిఖాగ్రముల నెక్కెను.

ఆంధ్రవచన కావ్యములు మిక్కిలి ప్రాచీనకాలమునుండి వాడుకలో నున్నవనియు అవి కూడ పద్యకావ్యములవలె దీర్ఘ సమాసాలంకారములతో నింపి వేయబడి యున్నందున ఆదరణ పాత్రములు కాలేదనియు పండితోత్తములు అభిప్రాయపడుచున్నారు. మనకు లభించు ప్రాచీన వచనకావ్య

ములు 18-వ శతాబ్దము వాడగు కళువె వీరరాజు కృతమగు వచనభారతము, సముఖము వెంకట కృష్ణప్పనాయకుని వచనజైమిని భారతము మొదలగునవి. ఆధునిక వచనము 19-వ శతాబ్దము కడపటను 20-వ శతాబ్దారంభమున నుండిన చిన్నయసూరి నీతి చంద్రిక, చెదలువాడ సీతారామశాస్త్రి విసంధి సంఘటిత సంస్కృత నాటక కథలు, దక్కను పూర్వకథలు, బ్రౌను దొరగారి తాతాచార్యుల కథలతో ప్రారంభమై ఇక్కాలమున కుప్పలు కుప్పలుగా ఆంధ్ర వాఙ్మయమును నింపుచున్నవి.

ప్రాచీనకాలమునుండి గొప్ప గొప్ప ప్రబంధములతోను ప్రౌఢ కావ్యములతోను దులదూగు మన ఆంధ్రమున నాటక రచన లేకపోవుట కొంత హాస్యాస్పదముగా నున్నది. మాతృభాష (సంస్కృతము) నుండి పురాణములను ఇతిహాసములను ఆంధ్రీకరించిన మన ప్రాచీనకవులకు క్రీస్తుపూర్వము 5,6-వ శతాబ్ద ప్రాంతముననున్న విశ్వవినుత కీర్తియగు కాళిదాసుని శాకుంతలమును గాని, తరువాతి హర్షకృతులగు రత్నావళి, మున్నగు నాటకరాజములు కంటఁబడలేదా! లేక "కావ్యేషు నాటకంరమ్యం" అను వాక్యమును వినియుండలేదా ! ఆధునిక నాటకరచనకు పునాదివేసిన వారు ధర్మవరపు కృష్ణమాచార్యులు. ఇక్కాలమున ననేక నాటకకర్తలున్నను చిత్రనళీయకర్తలును, ఆంధ్రనాటక పితామహులునగు ధర్మవరపు కృష్ణమాచార్యులును, ప్రతాపరుద్రీయాది బహునాటకకర్తలగు కళాప్రపూర్ణ వేదము వెంకటరాయశాస్త్రులును గయోపాఖ్యానాది నాటక కర్తలగు లక్ష్మీనరసింహముగారును ముఖ్యముగా గణనీయులు. ప్రస్తుత కవులు ఆంగ్లేయులను బెంగాలీలను అనుసరించి నవలారచనకు పూనుకొనినారు. కాని తెనుఁగున నవలారచనకు మార్గదర్శకులు కందుకూరి వీరేశలింగం పంతులుగారు. వారిననుసరించి అనేకులిప్పుడు పూర్వకవులవలె "గొర్రెదాటు" పద్ధతి ననుసరింపక పౌరాణిక, సాంఘిక, చారిత్రకనవలలను, పూర్ణస్వాతంత్ర్యముతో వ్రాయుచున్నారు. ఇతర వాఙ్మయములలోని మార్పులను బట్టి ఆంధ్రవాఙ్మయమునందును మార్పులను గల్గింప నుద్దేశించుచున్నారు. ఇదంతయు భావిభాషాభివృద్ధికి మూలకందము కదా!

---

# మధుపానము.*

కుమారి బి. పి. సుశీలాబాయి.

మధువనగా మత్తును గలిగించు ఘనద్రవ పదార్థము. వైను, విస్కీ, బీరు మొదలగునవి యితరదేశములనుండి మనదేశమునకు దిగుమతి యగుచున్నవి. సారాయి, బ్రాంది, కల్లు, పొగాకుతో చేయబడు చుట్టలు, బీడీలు, సిగరెట్టులు, నస్యము, గంజాయి మొదలైనవి మనదేశములో ఉత్పత్తియగుచున్న మధు ద్రవ్యములు.

ఇది సంసార దుఃఖములను, కష్టములను, దేహపరిశ్రమ, మనోవ్యాకులమును బోగొట్టునను తలంపుతో పుచ్చుకొనుచున్నారు. ఇంకను సంతోషము, ధైర్యము, బలము, మొదలగునవి యిచ్చునని పుచ్చుకొనుచున్నారు. ఈ మధుపానము దుష్టప్రయత్నమునకు, సాధుహృదయమును కఠినహృదయముగ మార్చుటకు, హింసాగుణమును వృద్ధిపఱచుటకును సహాయకారి యగుచున్నది. సాధుహృదయమును కఠినపఱచు స్వభావమున కుదాహరణముగా రెండుపాత్రలను తీసికొని యొక దానియందు సారాయియు మఱొకదానియందు నీరునుపోసి రెండుపాత్రలలోను కోడిగ్రుడ్ల జొనలను వేసిన సారాయిలో వేసినజొన రాయివలె గడ్డకట్టును. ఈవిధముననే యనేకులు తమ మృదువైన హృదయములను సురలో నానబెట్టుకొని కఠినులగుచున్నారు.

జీవమును జంపుశక్తి గలదనుట కుదాహరణముగా రెండుపాత్రలను తీసికొని వానియందుకూడ సారాయి, నీటిని పోయుదము. రెండుపాత్రలలోను కప్పలను వేయుదము. సారాయిలో వేసినకప్ప వెంటనే చనిపోవును. దీనివలన చాలమంది ప్రజలు తమ ఆయుష్కాలము నంతయు సారాయిలో నానవేసికొని నశించుచున్నారని తెలియుచున్నది.

వేశ్యల యిండ్లకు పోవుటకు, జూదమాడుటకు, అల్లరి, హత్యలు చేయుటకు మధుపానము మూలాధారముగ నున్నది. ఈదురభ్యాసమువలన

---

* మదరాసు బాలికా కళావిజ్ఞాన ప్రదర్శనమున బహుమాన్కృతి వడసిన వ్యాసము.

కలహములకు కారణముతేర్పడి సర్కారువారివద్ద గ్రుద్దులు, తన్నులు మొద లగు అవమానకరములగు శిక్షలకు పాలగుచున్నారు. అనేక విధములగు క్షయ, బుద్ధిమాంద్యము మొదలగు రోగములతో బలహీనులై జనులు చని పోవుచున్నారు.

మధుపాన దురభ్యాసము దురదృష్టవశమున ధనవంతుల యిండ్లలో ప్రస్తుత నాగరికతతోగూడి యెక్కువగా అలవడియున్నది. ఈపానము రక్తనాళములగుండా దేహమంతయు ప్రవహించి గుండె కొట్టుకొనుదాని కంటె యెక్కువగా కొట్టుకొనుచుండుటచే మనుజు డేమిచేయుటకు దోపక యందరిని తన్నుచు తిట్టుచుండును.

కొందఱు బీదవారలైనను అప్పుచేసి మధువునుద్రావి, ద్రోహికి ఉప కారి యగపడినంత తాజేసిన పాపములెల్ల ప్రత్యక్షమగునట్లు ఋణదాత యగపడగనే తనయప్పు వడ్డితోకూడ కనుల గట్టినట్లుండుటవలన కొన్ని సమయములలో తాము ఆత్మహత్య చేసికొనుటయేకాక ఋణదాతలను చంపు టకుకూడ ప్రయత్నింతురు. కాబట్టి మధుపాన మెంత కఠిన దుష్టకార్యము లకైనను దారితీయుచున్నది. కొందఱు బీదవారు తాము సంపాదించు డబ్బంతయు మధుపానమునకు వెచ్చించి యింటిలో నుండువారిని పస్తు వేయుచుందురు. కొంతమంది జనులు కుటుంబములతోగూడ త్రాగి యప్పు లపాలై నిలువనీడలేక యల్లాడుచున్నారు.

పొగాకుతో చేయబడు వస్తువులన్నింటిలో నూటికి మూడుపాళ్లు విషమున్నదని యొక శాస్త్రజ్ఞుడు వ్రాసియున్నాడు. చుట్టలు త్రాగుట వలన చూపుకనబడదని మనవారికి తెలిసియు దానిని మానరు. ఒక కవి మద్యపానము చేయువారిని వర్ణించుచు ఇట్లు వ్రాయుచున్నాడు.

సీ॥ లక్షాధిపతులెల్ల - భిక్షాధిపతులైరి
మద్యపానముయొక్క - మహిమవలన ।
సుజ్ఞానవరులెల్ల - రజ్ఞానవరులైరి
మద్యపానముయొక్క - మహిమవలన ।

భీమబలాఢ్యులు - హీనులైనిలిచిరి
మద్యపానముయొక్క - మహిమవలన ।
గౌరవార్హులు తాము - గౌరవహరులైరి
మద్యపానముయొక్క - మహిమవలన ।

గీ॥ ఎట్టిసుఖముల నేనియు - నీయలేని
కల్లుద్రావుటమాని - సుఖంబులొంది
యాయురారోగ్య భోగ భా - గ్యములతోడ
భరతమాతను సేవించి - వరలుడయ్య ॥

దేవదాసు నాటకములో ప్రాణములు గోలుపోవుటకు మద్యపానమే కారణముగా నుండెను. సతీ లీలావతి యను ప్రదర్శనములోకూడ మద్యపానమువలన వారనుభవించిన కష్టములు చెప్పనలవి గాకున్నవి. కనుక దేశక్షేమమునకై యిటువంటి ప్రదర్శనములను ప్రదర్శించువారికి మనమెంతయు కృతజ్ఞులము. మధువును ఇంత యమితముగా మన సహోదరులు త్రాగుటకు మన హిందూదేశమందు ఈత, టెంకాయ, తాటిచెట్లు ఎక్కువగా పెరుగుటయే. ప్రధానమంత్రి గౌ॥ సి. రాజగోపాలచారిగారు సేలం జిల్లాలో మధుపాన నిషేధ శాసనమును అమలుపఱచిరి

మధుపాన నిషేధమునుగూర్చి బైబిలులో త్రాగుబోతులు పరలోక రాజ్యమునకు అర్హులు కానేరరనియున్నది. పంచమహాపాతకములలో నొకటిగా చేరొక్కన్న నీమద్యమును త్రాగకూడదని మనపెద్దలు వక్కాణించుచున్నారు. ప్రస్తుత కాంగ్రెస్ మంత్రులు మధుపాన నిషేధమును ఎటులైనను సాధింపబూనుకొని యుండుటవలన దేశము బాగుపడగలదని నమ్ముచున్నాను.

# ఆశీస్సు.

బాలకవి అష్టావధాని అల్లమరాజు నారాయణరావు, బొబ్బిలి.

—: గీతమాలిక. :—

శ్రీకరంబుగఁ జిరమువర్ధిల్లుమమ్మ !
ఆంధ్రదేశంబునం గీర్తినలరుమమ్మ !
యిరుగుపొరుగులతో వాదులెంచకమ్మ !
తోడివారల స్నేహంబు వీడకమ్మ !
కవుల యాశీస్సులంబొంది క్రాలుమమ్మ !
దేశభక్తినినీటుగాఁ దెలుపుమమ్మ !
సర్వదేశసంచారంబు సలుపుమమ్మ !
తీరుగానీతులెపుడు బోధింపుమమ్మ !
సతులచారిత్రములఁ జక్కఁజాటుమమ్మ !
వివిధవార్తాలహరితోడ వెలయుమమ్మ !
ప్రేమపథమున నెపుడు దీపింపుమమ్మ !
సొంపునడకలతో విహరింపుమమ్మ !
పత్త్రికలయందు మణివివై వరలుమమ్మ !
పలుకుపలుకునం దేనియల్ జిలుకుమమ్మ !
శ్రావ్యతరపద్యరచనల సాగుమమ్మ !
విధులఁదప్పక నెలనెల వెడలుమమ్మ !
మంచిగాథలతోడ రాణించుమమ్మ !
యెల్లవారికిముద్దుగా నెసఁగుమమ్మ !
ధీరగుణకల్పవల్లి ! శ్రీ తెనుఁగుతల్లి !

# కన్ఫూషియస్ ఋషి.

## జీవితము - ఉపదేశములు.

క్రీ॥ పూ॥ 551 సంవత్సరమున వర్తమానమందలి శాంతఘాయను ప్రదేశమునకు పశ్చిమభాగమందున్న 'చూ' అను పేరుకల యొక గ్రామమందు కన్ఫూషియస్ జన్మించెను. ఆయన తలిదండ్రు లొసంగిననామము 'కుంచిఊ' ఉపాధి 'టుంనీ'. కాని యాయన శిష్యగణము 'కుంఫుజు' నామమున నాయనను పిలుచుచుండిరి. కుంఫుజు శబ్దార్థము దార్శనికుడు లేక జ్ఞానియని గ్రహింపనగును. ఈ పేరు క్రైస్తవ మిషనరీల యుచ్చారణయందు 'కన్ఫూషియస్'గా మారిపోయెను.

క్రీ॥ పూ॥ రెండువేల అయిదువందల వత్సరములకు పూర్వము చైనాసామ్రాజ్యమును ఇయావో, ఓశాన్, అను నిర్వురు చక్రవర్తులు ప్రతిష్ఠించిరను ప్రవాదము కలదు. కాలక్రమమున నావిశాల సామ్రాజ్యము ఖండఖండములుగ విభక్తమాయెను. ఆసమయమందు 'చావో' రాజవంశమువారి యధీనమున 'కన్ఫుషియాస్' నివసించుచుండెను. రోముసామ్రాజ్యమందలి జర్మనీదురవస్థను బోలి అప్పుడు చీనా దురవస్థ దుర్భరముగ నుండెను. చావో, పరులయధీన మందుండెను. రాజు బలహీనుడై మెలగజొచ్చెను. అప్పుడు తండ్రి సామాన్య మిలిటరీ యాఫీసరై యుండినను కన్ఫుషియాస్ ఇన్-మహారాజ వంశమునుండ స్వీయవంశోత్పత్తికి గడంగియుండెడివాడు. 19 వ వత్సరమున నీయనకు వివాహమాయెను. ఒక పుత్రుడును, పుత్రికయు కలిగిరి. వివాహమైన కొలదిదినములకు రాజ్యసస్యాగారమున కధిపతిగ నియమింపబడెను. ఒక వత్సరము గడచిన పిమ్మట భూముల పరిపాలనా కార్యమునకు మార్చుటవలన నీతని పదవి యున్నతమాయెను. క్రీ॥ పూ॥ 527 సం॥ ఈయన తల్లి మరణించెను. తదనంతర మీయన చైనాదేశీయుల పద్ధతి ననుసరించి యుద్యోగమును వీడెను. అటుపిమ్మట యే విధమగు ఉద్యోగమునకు గడంగక అధ్యయన, అధ్యాపనములయందు మనోనివేశ మొనర్చెను. ఇందువలన నీతని యశస్సు నలుదిక్కుల ప్రసరింపజొచ్చెను. అనేకు లీయనశిష్యత్వమును నంగీకరించిరి. 'చూ' గ్రామమందు విద్రోహ

మేర్పడెను. అందువలన నీయన సమీప గ్రామమగు 'చీ' యందు నివసింప దొడంగెను. అచ్చటి రాజుల ననేకమారు లీయన సందర్శించెను. కాని వారీయన కేవిధమగు సహాయమును చేయకుండిరి. తత్కారణమున తిరిగి స్వగ్రామమున కరుదెంచి యందే నివసింప జొచ్చెను. దాదాపుగ 50 వత్సరములచటనే యధ్యయన అధ్యాపకము లొనర్చుచుండెను.

'చీ' రాజ్యము మిక్కిలి శోచనీయావస్థను గాంచెను. మంత్రి ఇయాంహు సింహాసనము నధిష్ఠించుటకు బ్రయత్నించెను. 'లావో' 'మోజే' అను ఇర్వురు ఋషులును, కన్ఫ్యూషియస్‌కు సమకాలికులు. లావో అత్యుత్తమమగు నివృత్తిమార్గమును ప్రచార మొనర్చుచుండెను. ఆయన మతానుసారము కర్మ యొనర్పకుండుట వలననే సుస్థిరశాంతి లభ్యమగును. 'మోజే' విశ్వప్రేమికుడు; మైత్రి ప్రచారకుడైయుండెను కన్ఫ్యూషియస్ కర్మయోగి.

దేశదురవస్థను గాంచి, సహింపజాలక కన్ఫ్యూషియస్ దేశసేవాతత్పరు డాయెను. ఆయన దేశమందలి పురాతనవిషయముల నధ్యయన మొనర్చి ఇరుగ్రంథముల రచించెను. అతీతుల కీర్తిప్రతిష్ఠలను వెల్లడించు గ్రంథములను జనసంఘమున కొసంగిన యెడల జనులు సన్మార్గవర్తను లగుటవలన దేశమందు శాంతి నెలకొనునని యాయన మనోనిశ్చయము.

చివరకు విద్రోహులు క్రీ॥ పూ॥ 501 సం॥ ఇయంహూ రాజ్యమునుండి పలాయనులైరి. తదనంతరము కన్ఫ్యూషియస్, యొక పట్టణమునకు గవర్నరాయెను. ఒక్క వత్సరకాలములోనే యాయన స్వకార్యములయందు సాఫల్యపండితు డగుటవలన, మరుసటి వత్సరమున రాజ్యమందలి ప్రధాన విచారకపదమందు నియుక్తుడాయెను. దేశదుఃఖము దూరీకృత మగుటకు రాజునకు మిక్కిలి సహాయ మొనర్చెను. అందువలన రాజున కీతనియెడల మిక్కిలి భక్తి శ్రద్ధ లేర్పడెను. పర శ్రీ కాతరులగు చుట్టుప్రక్కల రాజులు, కన్ఫ్యూషియస్‌కును, రాజు-మంత్రికిని పరస్పర విరోధమును కల్పింప వలయునను నుద్దేశముతో నృత్య మొనర్చు వేశ్యలను రాజుకడకు బంపించిరి. రాజు వేశ్యలతో గూడి మూడు దినములు దర్బారునకు రాకుండెను. అందువలన కన్ఫ్యూషియస్ విరక్తచిత్తుడై క్రీ॥ పూ॥ 497 సం॥ రాజ్యమును వీడి పరదేశముల కరిగెను. శిష్యులతోడ నీయన పదుమూడు వత్సరములు పర్యటనం బొనర్చెను.

క్రీ॥ పూ॥ 484 సం॥రమున నొకానొక ప్రియశిష్యుని యాహ్వానము వలన తిరిగి జన్మదేశమునకు వచ్చెను. అచ్చట 478 సం॥ వరకుండి మరణించెను. ఆయన జీవితమును వీడునప్పటికి వయసు 72 వత్సరములు. శేషవయసున మిక్కిలి శోకసంతప్తుడాయెను ఆయన ప్రియపుత్రుడు గతించెను. తదనంతరము ప్రియశిష్యుడు మరణించెను. మృత్యువునకు పూర్వము, కన్ఫ్యూషియాస్ యొక పురాతన గ్రంథమును సంపాదించి దానిని ప్రచురించెను. ఆయన స్వతంత్రముగ నొక గ్రంథమును రచించెను. ఆయన యుపదేశములను శిష్యులు గ్రంథరూపమున బ్రచురించిరి. ఆ గంథమునకు ఇంగ్లీషు అనువాదము కలదు. కన్ఫ్యూషియాస్ శిష్యులు ఆయన యుపదేశములను ఆయన మరణించిన రెండు మూడువందల వత్సరముల తర్వాత ప్రచురించిరని నుడువుదురు. జ్ఞానగభీరతయందు కన్ఫ్యూషియస్ గ్రీసుదేశమును పవిత్రవంతముగ నొనర్చిన ప్లేటోతోడను, భారత వర్షమందలి మనువు, కౌటిల్యుల తోడను పోల్చదగును. ఆయన యుపదేశములు సమస్త మానవుల కాదర్శప్రాయములు. ఒకచోట నీ క్రిందివిధమున నుడివెను.

"15 వర్షముల ప్రాయమందు సుశిక్షణ బొందవలయునను ప్రబలేచ్ఛ యుండును. ముప్పది వత్సరముల వయసున తనంతటతాను నిలువగలుగును. 40 వత్సరముల ప్రాయమున మనస్సు సందేహవిముక్తమగును. 50 వర్షమందు స్వర్గీయ నియమముల పాలింపుచు, భగత్స్వరూప మవగతమగును. 60 వర్షములప్పుడు మన కర్ణములు మనల ననుసరింపుచుండును. 70 సం॥ ప్రాయమున వివేకానుసారము కర్మలొనర్పుచుండును. అంతర్బహిర్విషయముల యందు సత్యమునుండి విచలితులము గాకుందుము."

"జీవితకాల మంతయు తలిదండ్రుల సేవయందుండుటయే, పుత్రుల కర్తవ్యము. మృతులైన తలిదండ్రుల కొరకు పుత్రుడు శోకసంతప్త హృదయమున అంత్యక్రియల నాచరించి బ్రతికియున్నంతకాలము వారిని ఉపాసింపు చుండవలయును.

"సజ్జనుడగునాడు స్వీయవాక్యములను కార్యరూపమున బరిణమింప జేయును. తదనంతరము దానిని వాక్యముల ద్వారమున సిద్ధాంతీకరించును."

"చింతాశీలతలేని వ్యక్తియధ్యయనము వ్యర్థము. అధ్యయన వ్యతీతమగు చింతాశీలత మిక్కిలి విపజ్జనకము."

"అజ్ఞాతమగు దాని దెలిసికొనుటయే జ్ఞానము."

"బండికి కట్టుటకు కొయ్యబద్దెలును, లగాములుండినగాని, గుఱ్ఱము బండినిలాగజాలదు. అటులనే మానవుడు విశ్వాసవ్యతీతముగ బ్రతుకజాలడు. సత్యమని యెఱింగినదానిని ఆచరణయందు బెట్టజాలనివాడు సత్సాహస భీరుడు."

"శ్రద్ధావ్యతీతముగ ప్రేమసంభవము కాదు. సహజసౌందర్యమున నలరారు ప్రాకృతిక శోభకును, అలంకారముల కృత్రిమసౌందర్యమున కుండు భేదమే శ్రద్ధాన్విత ప్రేమ శ్రద్ధావిహీన ప్రేమలయందు బొడగట్టుచుండును."

"గతించిన విషయములను గూర్చి నేను మాటలాడను. దేనినైనను స్థిరీకృత మొనర్చుటకు నే నెవ్వరిని దూఱను. జరిగిన కార్యమును గూర్చి నే నెవ్వరిపైనను నిందమోపను."

"దానహీనమగు ధనము- శ్రద్ధావిహీనమగు సేవ-దుఃఖవిహీనమగు శోకము-అర్థవిహీనములు."

"ప్రేమయే సకలవిషయముల కంటె సుందరమును-సుశ్రీయని గ్రహింపనగును. ప్రేమ విహీనుడగు మానవుడు ఆభావములను సహింపజాలడు. వాని సౌభాగ్యము గూడ చాలదినములుండదు. ప్రేమిక హృదయమందలి ప్రేమయే శాంతిని కలిగించును. కాని జ్ఞానము లభించును. మానవుని ప్రేమించునది యసహ్యించుకొనునది ప్రేమయేగదా! ప్రేమపూరిత హృదయు డెప్పుడును, అన్యాయ-అసాధుకార్యము లొనర్పడు."

"సత్యాన్వేషి యగువాడు సామాన్యవ్యసన-ఆహారములతోడ తృప్తి నొందనిచో, వానికి సత్యము లభ్యముకాదు."

"సజ్జనులకు ఫసందు, ఆఫసందను విషయములతోడ సంబంధములేదు. సత్యము-న్యాయమే వారి యాదర్శము. అదియేవారికి ఫసందు."

"ఉన్నతపదవుల గూర్చి యెప్పుడును చింతింపకుము. కాని వాని కొఱ కెప్పుడును సంసిద్ధుడవై యుండుము. సుయోగము ప్రాప్తించునప్పుడవి లభించును. జీవితమందపరిచితము-అజ్ఞాతవిషయము లున్నవని దుఃఖింపకుము, జీవితమూల్యమును వృద్ధిపఱచుకొనుటకు బ్రయత్నింపుము."

"సాధుత్వము, మానవప్రీతియే నా యుపదేశముల సారము."

"సత్యమును గాంచిన దానిని పొందుటకు ప్రయత్నింపుము. అసత్యమును గాంచినప్పుడు అది నీహృదయమందు దాగియున్నదా యని పరిశీలించుకొని, యున్నచో వెంటనే దానిని పరిత్యజించుము."

"సాధుజనులు విళంబముగ మాటలాడుదురు. అవిళంబముగ కార్యము లొనర్చుదురు."

"పురాతన పాపవిషయముల మఱచిపోయిన కొలది నీకు శత్రువులు స్వల్పమగు చుందురు."

"స్వీయదోషముల గాంచియు, వానిని తొలగించుకొనుటకు ప్రయత్నించువానిని నే నింతవఱకు చూడలేదు. ఒక తప్పును జీవితమందు రెండు మార్లు చేయకుము. గాలి సేవనము కొరకు విహారించునప్పుడు, సరియగు మార్గమున నడువ నలదు. ఏలయన, ఏదయిన కార్యనిర్వాహణకు బోవుబండ్లు ఆమార్గమున వచ్చుచు బోవుచుండును."

"సాధుజీవితమందు స్వభావము, శిల్పమును, సమన్వయమును సృష్టించును. ఉభయులకు సామ్యముండని యెడల అహంకార ముండదు. కాని కృత్రిమత్వము ప్రకాశింపుచుండును. ఉన్నత స్తరమందుండు మానవులతోడ నున్నత తత్వసంబంధమున బ్రసంగించుము. కాని యెప్పుడును నిమ్న స్తర మందుండు వ్యక్తులకడ నా విషయములను బ్రసంగించజనదు."

"సిద్ధిని బొందవలయునని వాంఛించుట కంటెను, సాధనయం దుండవలయునని తలంచుటనే ప్రేమయందురు. జ్ఞానము సముద్రతుల్యముగు గంభీరము. ప్రేమ మహాపర్వతమును బోలి శాంతము, జ్ఞానజీవితము నుపభోగించుము. ప్రేమవలన పూర్ణత, ప్రాచీనత, లభ్యమగును. సజ్జనుని దబాయించగలవు. కాని వానిని మూగవానిగ చేయజాలవు సుమా! ప్రేమ స్వీయకళ్యాణముకంటె, పరుల కళ్యాణవిషయమును గూర్చి సుస్ఫుటముగ నన్వేషణం బొనర్చును."

"కడుపున కింత ముతకభోజనము, ధరించుట కొకింత వస్త్రము లభించి, కొయ్యమీద చేతిలో తలపెట్టుకొని నిద్రించునప్పుడుండు శాంతి మఱే యేవిధముగను లభ్యముకాదు. అసాధుభావమున లభింపుచుండు ధనము, సన్మానము మొదలగునవి మేఘములబోలి యస్థిరములు."

"కన్ఫూషియాస్ నీతియుతమగు కవితను, ఇతిహాసములను, మిక్కిలి యానందముగ చదువుచుండును. కాని యాయనకు ప్రియతమమగు విషయము సత్ శిక్ష, సదుపదేశములు. ఆయన ఇట్లు నుడివియుండెను. "నేనెప్పుడును ద్వివిషయముల గూర్చి బోధింపుచుందును. అందొకటి సత్సాధన, రెండవది అసత్యవర్జనము."

"జీవితమందు నాలుగు విషయముల నభ్యసించుము. (1) సత్యము (2) సద్భావము (3) విద్య, (4) సాధుత్వము."

"మహాపూరుషులను జీవితావస్థయందు దర్శించుట దటస్థింపకున్నను, ఒక మహావ్యక్తిని, లేక యుత్తమ మానవుని దర్శించిన చాలును. సత్సంగ ప్రాప్తి దుర్లభము. కావున సద్విషయముల గూర్చి ప్రసంగించువారు దొరకినను తృప్తిపడుము." "ఆహా మనమెట్టి సౌభాగ్యవంతులము! ఏవిధమగు అన్యాయకార్య మొనర్చినను లోకులు వెంటనే తెలిసికొందురు గదా."

కన్ఫూషియస్, మిక్కిలి గాన ప్రియుడు. ఒక్కొక కీర్తనను పలుమారు పాడించి విని సంతసింపుచుండును. ఒక సందర్భమం దిట్లునుడివి యున్నాడు.

"నేను జ్ఞానినని సాహసించి యెవరితోడను నుడువజాలను. కాని నేను పెద్దమనుష్యుడ నని మాత్రము చెప్పగలను. జ్ఞానప్రేమలు నాయందెచ్చట నున్నవి? నాకు జ్ఞానతృష్ణకలదు. ఉపదేశము లొనర్చు చుండుటను నిచ్చగింపుచుందును"

"పెద్ద మనుష్యులు, ధీరులును, శ్రేమికులునై యుందురు. సాధారణు లెల్లప్పుడును వాక్యవ్యయ మొనర్చుచుందురు."

"నేను మిక్కిలి గంభీరుడను. కాని కోమల హృదయుడను. నేను కఠోరుడను. కాని కఠినుడనుకాను. నేను శ్రద్ధాయుతుడను కాని చపలుడనుకాను."

"సాధనచేయవలయునను తలంపు నీకు గల్గినప్పుడు నీయధీనమందుండు కాల మత్యల్పమని యెఱుంగుము."

"నేనెప్పుడును జ్ఞానవిషయమును, ప్రేమ విషయమునుగూర్చి మాటలాడను. ఏలయన, అవి నా బుద్ధికి అతీతవిషయములు."

"నాకు, ఆవశ్యకము, ఉచితమనితోచినప్పుడు మాట్లాడుదును."

కన్ఫ్యూషియాస్, ఒక దినమున నదీతీరమందు నిలుచుండి యిట్లనియె. "ఈనది నిరంతర మిట్లులనే ప్రవహించుచున్నది. మానవజీవన మెంతచంచలము! అయినను మానవుడు నిశ్చింతగా నుండును."

"అయ్యో? మానవుని బయట నెంతగా ప్రేమింపుచుందునో, వాని యంతరమును గూడ నంతగ ప్రేమింపగలుగుదునా"

"జీవితమం దెప్పుడును దృష్టిని సమ్ముఖమందు నిగిడింపుచుండుము. ఎప్పుడును వెనుతిరిగి చూడవలదు."

"సత్యము సాధుత్వ మనునవి నీకు ప్రభువులగు గాక. నీవు నీకే ప్రియబంధువవు. స్వీయదోషములు పొడగట్టినప్పుడు వానిని విసర్జించుటకు సిగ్గుపడకుము." "సైన్యమునకు సైన్యాధిపతి లోపించిన దానికంటెను, ధృఢసంకల్ప హీనులగు సైనికులవలన అపారనష్టము కలుగును."

"జ్ఞానమందు సందేహముండదు. ప్రేమయందు దుఃఖముండదు. సాహసికునకు భయముండదు."

స్వగ్రామవాసులు, బంధుబాంధవులయందు కన్ఫ్యూషియాస్ అమాయికునివలె ప్రవర్తిల్లుచుండెను. విస్తారముగ నెవ్వరితోడను మాటలాడకుండెను. మందిరమునందు మిక్కిలి మితముగసంభాషించుచుండెను. మఱియు స్వల్పాహారియు, ఉపవాసపరాయణుడై మెలంగ జొచ్చెను. ఆహారసమయమున గాని, శయనముమీద గూర్చుండికాని మాటలాడి యెఱుంగడు. ఆయన నిదురించునప్పుడు శరీరమువక్రతను జెందదు. అట్లని మృత శరీరతుల్యము కాదు. మిక్కిలి స్వల్పకాలముమాత్రమే నిదురింపుచుండెను. ఆయన ఇట్లు నుడివియున్నాడు. "మనము మృతవ్యక్తులయందు చూపు శ్రద్ధా భక్తు లెక్కుడగుటవలన, జీవితవ్యక్తుల విషయమున మన కర్తవ్యములను మఱచుచుందుము."

"మృత్యువును తెలిసికొనగలిగినచో జీవితము అనిత్యమని తెలియును."

"తన్నుదాను జయించుటనే ప్రేమయందురు. పరులను ఆత్మతుల్యముగ చూచుటను, స్నేహమందురు. మనము జీవితమందొక దినమైనను పరులను ఆత్మతుల్యముగ గాంచగలిగినచో, సంఘము ఉన్నతస్థితిని

కాంచును. ప్రేమ హృదయమందు మేల్కొనినప్పుడు దాని స్పర్శవలన పరులుగూడ ప్రేమికులగుదురు. అసీమ ధైర్యయుతమగునది ప్రేమ." "సత్యవాది యితరులయందుండు సత్యమును గాంచగలుగును. మఱియు దానిని గ్రహించును. అసత్యవాదికి ఇతరులయందసత్యముమాత్రమే గోచరించును." "ఖ్యాతిగలవారన, ఇంటను రచ్చను విఖ్యాతులగుటయని గ్రహింపనగును. ఇతరులతప్పులను దిద్దుటకు వ్యర్థప్రయత్న మొనర్చుటకంటెను తాను విశుద్ధుడగుటకు బ్రయత్నింపవలయును. అందువలన మనస్సు ఉన్నతినిగాంచును; పన స్వభివృద్ధి జెందిన కొలదిని మహానుభావుడగును."

"మానవజాతిని సమానభావమున చూచుచుండుటను ప్రేమించుటయని యెఱుంగునది. తనను, మానవజాతిని, సమానభావమున తెలిసికొనుటను జ్ఞానమందురు."

"మార్గమును చూపించుటతోడ నాయకుల కర్తవ్యము పూర్తిగాదు. ఆతడు ముందుగా చెప్పినటుల చేసిచూపింపవలయును. నాయకుడు మృత్యుముఖమందుకూడ విచలితుడుకాడు; వెనుక కడుగిడడు."

"ఉన్నత జీవికుడు జీవించువాని యాదేశములను వెంటనే మానవులు మన్నింతురు. ఉన్నతజీవితము గడుపనివానియాజ్ఞల నెవ్వరును గమనింపరు. నూఱుమాట్లు చెప్పినను చెవిజొరనీయరు." "ప్రేమికు డెప్పుడును వినయముగనుండును. కర్మిష్ఠుడై యలరారును. ఉత్సాహము విశ్వాసముల గూడియుండును. ప్రేమకపరనామములు సాహసము, శక్తి, సరళత్వము."

"ప్రేమికుడు ఉన్నతభావపూరితుడు. కాని యహంకారికాడు."

"మహాపురుషులకు సేవయొనర్పవచ్చును. కాని వారిని సంతుష్టిపఱచుట మిక్కిలి కఠినము."

"విశ్రాంతినిగోరువాడును, ఆయాసమును జెందువాడును పండితుడుగాడు."

"హృదయము కలిగినవానికి మాత్రమే శిక్ష నొసంగుము. ఎల్లరను హృదయహీనులనితలంపకుము."

"ప్రేమికుడు మిక్కిలి సాహసుడుగ [illegible] అందువలన సాహసుల నందరిని ప్రేమికులని తలంపకుము

"నీ స్నేహితులెల్లరు నీ క్షేమమును గోరుచున్నారని తలంపకుము. నీయందలి దోషములను సవరించుటకు ప్రయత్నించువానినే మిత్రుడని యెఱుంగుము."

"ధనవంతు డహంకారి కాకుండవచ్చును. కాని దరిద్రునకు సంతసము కలుగుట అతికఠినము." "సమయమునను సరించి ప్రసంగమునకు గడంగినచో లోకులు విరక్తిఁ జెందరు.

"సాధుపుంగవుల హృదయము, జీవనము సర్వదా నున్నతగామియై యుండును. కాని యసాధుల హృదయము జీవితము తద్విపరీతము"

"ప్రాచీనులు తమకొఱకు శిక్షను బొందుచుండిరి. నవీనులు ఇతరుల కొఱకు శిక్షను బడయుచున్నారు. మనకు వాక్యములకంటె కర్మశక్తి వృద్ధియగుట ముఖ్యము."

"ప్రతిష్ఠకలుగకుండెనే యని దుఃఖింపకుము. నీయందలి లోపముల కొఱకు పరితపించుము. మిథ్యను, అవిశ్వాసమును ఇతరులకడనుండి యభ్యసింపవలయునను తలంపు లేనివాడే శ్రేష్ఠమానవుడు."

ఉత్తమశిక్షను నీచులకడనుండి యైనను బడయుట పరులదోషములను గమనింపకుండుట స్వీయావస్థకు సంతసముగనుండుట అనునవి యుత్తమ పురుష లక్షణములు."

"సంసారత్యాగము సర్వశ్రేష్ఠమగు త్యాగము. దేశత్యాగము నిమ్నతరగతికి జెందును.

"ఎంతమంది మానవులు మనస్సును తెలిసికొన గలుగుచున్నారు? విశ్వాసివి సత్యవాదివిగమ్ము. వ్యవహారమందు సర్వదా వినయాచరణుడవుగమ్ము."

"దేహముకంటెను మనస్సును మిక్కిలిగ ప్రేమించుము. ఇతరుల గూర్చి మిక్కుటముగ యోచింపకుము నీ లోపల నీవు నిరంతరము చూచుకొనుచుండుము. అదియే శాంతి."

"దూరదృష్టి లేకుండుటవలన అనేకులు మిక్కిలి కష్టముల బొందుచుందురు."

"సాధుపుంగవుడు యశముకంటె సద్గుణము లెక్కుడు కావలయునని

కోరుచుండును. సాధుపుంగవుడు అంతర్ముఖుడు. అసాధుమానవుడు బహిర్ముఖుడు.'' "లోకవ్యవహారములయందంతదృష్టి మిక్కుటమైన కొలదిని యాతడున్నతిని బొందుచుండును. మానవునకు శ్రేష్ఠతమకర్తవ్యము మైత్రి.''

"ప్రేమవ్యతీతముగ జ్ఞానమసంభవము. వ్యర్థముగ దినములకొలది యుపవసింపుచు, రాత్రులకొలది మేల్కాని ధ్యానమునందు కాలమును గడుపుచుండుటకంటెను శాస్త్రపాఠము, సాధుసంగమ మత్యుత్తమము, అంతకంటె ప్రేమయే సర్వోత్తమము. సత్స్నేహితులసంఘము సాధుపుంగవుల ప్రశంస సంగీతశ్రవణము అను మూడింటివలన నేను మిక్కిలి శాంతమును బొందుచున్నాను. యౌవనమందు కామము కైశోరమందు ద్వంద్వము వృద్ధవయసున లోభమును అణచి పెట్టుము.''

"ఆజన్మజ్ఞానులగువారే సర్వశ్రేష్ఠులు.'' "నీరవత, నిర్జనతలకొఱకు నేను మిక్కుటముగ నన్వేషణం బొనర్చుచున్నాను.''


"గంభీరనీరవతయందే మనమున్నతి బొందును. జ్ఞానము లభ్యమగును.''

"దుఃఖమే మానవుని ప్రకృతస్వరూపమని తెలుపుచున్నది.''

## అనుభూతి.

నాగ నరసింహులు నాయనింవారు.

పడఁతి పంపిన యానంది - వర్ధనంబు
మ్లానమయిపోయె నెన్నఁడో - కాని, దాని
నవ్యసురభిళ మార్దవ - నైగనిగ్య
ములు మదీయ హృదంతర - ముద్రితమగు
నందివర్ధన కుసుమంబు - నందునిలిచి
హృదయ పథముల సుధలవ - ర్షించుచుండు.




జడ్జి; నీవు వాదిపై ఇటికరాతిని విసరినట్లు సాక్ష్యము రుజువు చేయుచున్నది

ప్రతివాది: అంతేకాదు దేవరా, ఆరాయి వానికి తగిలినట్లుకూడ రుజువు చేయుచున్నది.

*     *     *     *     *     *

పట్టణమున క్రొత్తగా అంగడిపెట్టిన సెట్టిగారికి మునిసిపల్ ఆఫీసు నుండి ఒక ఫారము పూర్తిచేసి పంపవలెనని వచ్చినది. చాల యోచనచేసి దానిని పూర్తిచేసినాడు

పేరు: సుబ్బిసెట్టి.

పుట్టుక: బ్రదికియే.

వ్యాపారము: ఏమిబాగా జరుగుటలేదు.

*     *     *     *     *     *

"నాయనా, నేను పెండ్లిచేసికోవలెను"

"ఇదేండ్లకే పెండ్లా? ఎవరిని నాయనా?"

"అవ్వను"

"వెధవా, మాఅమ్మనారా పెండ్లాడుతావు?"

"నీవుమాత్రము మాఅమ్మను పెండ్లిచేసికోలేదా?"

*     *     *     *     *     *

ఉపాధ్యాయుడు: నీవు చాల మేధావంతుడైతే ఏయంత్రమును కని పెట్టవచ్చును?

రాముడు: ఒకమీటనొక్కిన ఇంటిపాఠములన్ని పూర్తిచేయుదానిని.

ఉషా: నీవు సోమరిపోతువని తెలియును. నీవురా, గోవిందా ?

గోవిం: ఆమీటను నొక్కువస్తువును కనిపెట్టెదను.

*   *   *   *   *   *

భార్య: నన్ను పెండ్లాడుటకు ముందు చాల ధనవంతుడనని అబద్ధములు చెప్పి మమ్ము మోసగించితివి.

భర్త: ప్రమాణపూర్తిగా అది మున్మాటికి సత్యము.

*   *   *   *   *   *

"ఈ గుహాలోపల దొంగలున్నారు. నీవు దిగిచూచిరా." అని పోలీసు నొకని పొమ్మన్నాడు ఇన్‌స్పెక్టరు. ఆపోలీసునకు భయము వేసినది. లోపలికి అడుగుపెట్టుచు వాడు "ఇదిగో, లోపలినుండి ఎవరైన పరుగెత్త నారంభించినచో వారిలో మొదటివానిని మాత్రము మీరు కాల్చ కూడదుసుమా" అని మందలించెను.

*   *   *   *   *   *

"డాక్టరుగారూ, కాగితాలాడుకొనుచున్నారేమి ?"

"ఏమిచేయవచ్చును. ప్రొద్దుపోగొట్టుటెట్లు ?

"రోగుల ప్రాణాలేవియు చిక్కలేదా ?"

*   *   *   *   *   *

# నోటీసు.

గుండ్లపల్లి - సుబ్బారావుగారు.

నేటిరాత్రి !     చా! చా!     చా! చా!     నేటిరాత్రి !!

పేరు లేని పెద్దపట్టణమున అమర్చియుండు మూస్వంతడేరాలో

అద్భుతము! ఆహ్లాదకరము! చూడవేడుక! శ్రవణానందము!
నేత్రోత్సవము!

చిమటలుకొట్టిన సీనులు! చింపిరిదుస్తులు! ఆరితేరిన రసలుబ్ధులు!
శ్రుతిహీనపు పాటలు ! వర్ణక్రమము లేని వర్ణమెట్టులు !
తాళజ్ఞానము లేని తదితరులు !!

## "భావప్రదర్శన పూర్ణానుస్వార నవరస నాశన నీరస సభవారిచే"

నేలగట్టుపల్లి కర్ణపిశాచ కవిత్వధ్వంస కాలనాభముగారిచే
రచియింపబడిన నవీన సంగీత

"హరి చిత్ర లవ రావ బృహ" అను చాచా నాటకము
ప్రదర్శింపబడును.

తాము బంధుమిత్ర సమేతులై వచ్చిచూచి నేత్రపండువ గావించుకొందురని
మాయాజ్ఞ !

మాఆక్టర్లు పాడుపాటయున్న చేయుఆక్టున్న పరోక్షమున చూచు వారికే వీరల సామర్థ్యము తెల్లము గాగలదు. వీరలధిక ధైర్య గాంభీర్య సాహసము గలవారలే. పాటలు కర్ణకుహరముల బగుల్చు గార్దభస్వరము తోను, తాళభేతాళములతోను, అర్థరీడ్డు హార్మోనియ విహీనముతోను, ప్రేక్షకులకు రౌద్రోద్రేకముకల్గి ఒడలు జలదరించునట్లు ప్రదర్శింపబడును. హరిశ్చంద్రుడు చంద్రమతిని మాలకమ్మి వెడలునపుడు నటించు హాస్యరసమును, నలుడు దమయంతిని వివాహమాడునపుడు నటించిన రౌద్రరసమును, ఆంజనేయులు శ్రీరామాశ్వమేధయాగ సందర్భమున లవకుశుల మార్గాన్న

సందర్భమున నటించిన బీభత్సరసమును, రామదాసు నిర్బంధితుడై కొరడాల చే మోదబడినపుడు నటించిన శృంగారరసమును, వీరరసమును, ఉత్తరుడు కౌరవసేనను చూచి నటించిన కరుణారసమును, శాంతరసమును చూడతగిన రంగములు.

### ముఖ్య పాత్రలు:—

బృహన్నల:-పూర్వసువాసినీ ఆంధ్రరంగ ధ్వంసోద్ధారక నిరక్షరకుక్షి బిరుదాంకితులగు, బుచ్చయ్యగారు.

బాహుకుడు:-పండితపుత్ర భావనాశన బాలబాబుగారు.

నలుడు:-నవరస విహీన బిరుదాంకితులగు నరసరాజుగారు.

రామదాసు:-రంగసింహ రామబ్రహ్మంనాయుడుగారు.

లవ, కుశులు:-ఆంధ్రనాటక జీరంగి, బాకా, బిరుదులందిన ముప్పది వత్సరముల వయస్సుగల లేబ్రాయపు ముద్దుబాలురు: చిట్టిబాబు, బుచ్చిబాబుగార్లు.

దమయంతి:-దండు దరిద్రాదేవిగారు.

కమల:-కళావిహీన, కలహకంఠి కామేశ్వరిగారు.

సీత:-సిరిముక్కల శివరామాబాయిగారు.

కబీర్:-కబోది కాటంరాజుగారు.

తదితర స్త్రీ పురుషపాత్రలు సమయోచితము. వీరలందరు విధ్వంసులే ?

రేట్ల వివరం.

1, 2, 3 తరగతులు పురుషులకుచితము.

1, 2, 3 తరగతులకు స్త్రీలు పురుషులవెంట రావచ్చును.

బాలురకు 2 × 2—4.

కంపెనీరూల్సు:—నోటీసు అడిగినవారికివ్వబడదు. రూల్సు అచ్చు వేయలేదుగాని విరుద్ధముగా నటించువారికి తమలపాకుబీడాలు యివ్వబడును. సిగరెట్టులు, బీడీలు, చుట్టలు, సోడా వగైరాలఖర్చులు తామే భరింపవలయును. టిక్కట్టులేనివాని కేయిక్కట్టులేదు. తరగతిమార్చి తరగతిలోకూర్చున్నవారికి తగుబహుమతు లివ్వబడును. అనుకూలమువల్ల ప్రదర్శన మాపుదలచేసినయెడల ఉప్మా, టీ ఉచితముగ యివ్వబడును. స్థలము నిండిన వెనుక అన్నితరగతుల టిక్కట్లు అతిత్వరితముగ ఇవ్వబడును.

దరిద్రదామోదర్, రంగధ్వంసక్, కళావిహీన్,

ప్రొప్రయిటరు. స్టేజిమేనేజరు-కండక్టరు. సెక్రెటరి.

# నవయువకుఁడు.

ఉభయ భాషాప్రవీణ, అయ్యాదొరాచార్య కవి.

మన యువకుఁడు మిగుల తెలివిగలవాఁడు. చిన్నప్పుడే "అఱవము, తెనుఁగు" రెండును వ్రాయఁజదువ నేర్చినవాఁడు. తర్వాతఁ గొంచె మింగ్లిషుభాషయు నలవాటు గలిగించుకొనినాఁడు. అన్నివిద్యలును గ్రహింపవలయునని యాతని తలంపు. కాలము చాలదు. కావున నన్నిటియందును నేదేదో కొంచె కొంచెమెఱిఁగినాఁడు. చేతిపనులు సయితమన్నియుఁ గొంత కొంత చేయఁబూనినాఁడు. ఒక్క పున్నమనాఁటిరేయి సుమారెనిమిది గంటలకుఁ దన మిత్రులతోఁగూడి వేశ్యలవాడలో సంచరించుచు, చక్కని చందిరన్ లయిటుచల్లని ట్రీస్ పయినిన్ నిర్దైందు పెంపెక్కిన పాల్కడల్ శిదరియిచ్చోటు పుల్లుగనిండెనాఁదగెన్ మిక్కిలి గాను మన్నుతలై మేలె సుమంబులు కారు మబ్బులోజిక్కిన చుక్కలట్లమరెసీయిద బోగము లేడి తెర్వులోన్ అని యాంధ్ర ద్రావిడాంగ్లములతో మనోహరముగ వర్ణించి, యేకకాలంబునఁ దన త్రిభాషాపాండిత్యమును బ్రకటించినాఁడు. మిత్రులానందపరవశులై చప్పట్లుగొట్టి గల్లునవ్విరి. సంతోషమతిశయించినది. అల్లసాని పెద్దనామాత్యునివలె నితరులచేఁ గవిగండపెండరముం దొడిగించుకొనుట తన కిష్టములేమిచేఁ గాఁబోలు దానే తనపాదమునం దొడిగికొనినాఁడు. సకల కళాధురీణుండుగావున నతఁడొకనాఁడు మిత్రుల యెదుటఁ దన సంగీత విద్యానైపుణ్యముం జూపనెంచి తంబుర చేఁబూని శ్రుతియొక్కించి రాగపరీక్షనెఱింగిన వాఁడగుటచే మేఘరంజనాలాపము సేయనారంభించినాఁడు. చాలసేపు శ్రమపడినాఁడు. కాని, యెందులకో నెమిలియొక్కటియైన నచ్చటికిరాదయ్యె "అక్కటా! అమెరికాలో నాంగ్లేయ సంగీత విద్యానిపుణుఁడొక్కఁడు 'నా సంగీతమున కానందించి నేను కూర్చుండిన సారధి సైతము కదలె!' నని వ్రాసినాఁడే. నా సంగీతమునకట్టి సామర్థ్యమేల రాదయ్యె" నని చింతించినాఁడు. అక్ష విద్యాచతురుండగుటచే నతఁడొకింతసేపు కాలము గడపనెంచి మిత్రులతోఁ జదరంగ రంగమునం గూర్చుండి దాయము, దుగ, తిగ, దచ్చి, బారా, చౌపంచ, తీపంచ, యని యఱచుచు రెండాటలాడినాఁడు కాని, పందెమును గెల్చుటయందు గెలుపునుమాత్రము తన మిత్రునకే వదలి తనకుఁగల

మిత్రవాత్సల్యమును గనఁబఱచినాఁడు. పాకశాస్త్రానుభవముగలవాఁడు గావున రుచిగలవంట సేయింపనెంచియు వైద్యవిద్య నెఱింగిన వాఁడగుటచే వసపులుసు వండించినాఁడు. సాముద్రికము నెఱిఁగినవాఁడు గావునఁ దన యఱచేతిలో హలకులిశాదిరేఖలు లేవని చింతించినను, బొటనవ్రేలియందలి గోధుమరేఖను గాంచి తృప్తిజెందినాఁడు. నాట్యకల నెఱిఁగియుండుటచేఁ జిత్రనళీయంబున బాహుక పాత్రనుధరించి తన వికారరూపంబునకు సిగ్గుపడి నటించుటమానినాఁడు. శకునశాస్త్రముపై దృష్టిగలవాఁడగుటచే మద్యమాంసము లెదురుగావచ్చునను తలంపునఁ బ్రయాణమగు నపుడెల్లఁ గల్లంగడిమార్గముననే పోవుచుండినాఁడు.

రెట్టమత శాస్త్రము నొకప్పుడు చదువుకొనినవాఁడగుటచే తడిసిపోవలసియుండునను తలంపున రాత్రులందును గొడుగు చేతఁబట్టుకొని నడచుట కారంభించినాఁడు. జ్యోతిశ్శాస్త్ర పారంగతుఁడు కావుననే ప్రతిదినమును మీనమేషముల వలనిఫలమును స్మరించుచుఁ గూర్చుండినాఁడు. యువకుఁడగుటచేఁ గొక్కోక శాస్త్రమును జదువుటాతనికి స్వాభావసిద్ధమైనది గావునఁ బద్మినీజాతి కన్యలభించుటరుదని కాఁబోలు వివాహేచ్ఛయే వదలినాఁడు. నీతిశాస్త్ర కుశలుండు గావున సేవకావృత్తి యనుచితమని రాజకీయోద్యోగములఁ గలలోసయితను విసర్జించినాఁడు. స్వయంకృషి లాభకారియని చేతిపనులొనరింపఁ బూనినాఁడు. కాని, దేనియందును సుఖము లేదని మానుకొనినాఁడు. మట్టిపెళ్లలను సయితము గట్టివరహాలు గాఁజేయవచ్చుననుకొని యింద్రజాలవిద్య నెంతో కష్టపడి నేర్చినాఁడు. రసాయన శాస్త్రమో వనమూలికాప్రభావమో కొంచె మెఱిఁగినవాఁడు గావునఁ దీరికయగు వేళలందెల్ల స్వర్ణాపేక్షచే ననేకలోహములను గరఁగి కరఁగి పాడుచేయుచున్నాఁడు. వేదాంతగ్రంథ పరిశీలనమో విరాగులస్నేహబలమో కాని ప్రాణాయామము సేయనుంకించియు నణిమాది సిద్ధులకొఱ కవస్థపడుచున్నాఁడు. పరకాయ ప్రవేశవిద్య నభ్యసించుచున్నాఁడేమో కావుననే, గుప్త ప్రదేశములందప్పుడప్పుడు పరుండి యూపిరిబిగఁబట్టి తల్లడిల్లుచున్నాఁడు. ఇంకను నేమేమి సేయనున్నాఁడో! ఇన్నివిద్యలు నేర్చినవాఁడేమిచేయఁజాలఁడు? చేయఁబూనిన నేది చేయఁగలఁడు? అన్నియుఁ జేయఁగలఁడు కాని, యొక్కటియైనఁ బూర్తిగా నెఱవేర్పఁగలఁడనుటకు సందేహింపవలసియుండును ఇన్నివిద్యలు నేర్చినవాని కేదేని యొక్క విద్యయైనను

సమగ్రముగా నేర్చుకొనుటమంచిదని తెలియకపోవునా? అదియు నాలోచించినాఁడు కావుననే "నూఱువిద్యలు నేర్చిన నక్క వేఁట కుక్కలచేఁ జిక్కి బిక్కిరించినది. ఒక్కవిద్యనే పూర్తిగా నేర్చిన పిల్లి చెట్టెక్కి తన ప్రాణములను గాపాడుకొనిన" దని చిన్ననాఁడు చదివినకథను జ్ఞప్తికిఁ దెచ్చికొనినాఁడు. దేనిని మనము పూర్తిగా నభ్యసింతమని దీర్ఘాలోచనకు దిగినాఁడు.

---

శ్రీరామా !

# కీ. శే. ఆర్ముగస్వాములు. (కొండకుప్పం)

A. వీరభద్ర పిళ్ళెగారు.

శిరికరుణీకవంశమున పొన్నపాలికిచేరిన కొండకుప్పమను గ్రామ కరణముగానుండిన షణ్ముగపిళ్లగారికిని నరసమ్మగారికిని 1862 దుందుభి నామ సంవత్సరము ఆనినెల 15 తేది గురువారమున జన్మించిరి.

వీరు బాల్యదశయందు చాల తుంటరితనముగల్గి యుండిరట! అందుచే వీరు వేమనను మేలనిపించిరని చెప్పుదురు. కొంతకాలము, కొండ కుప్పమునను కొంతకాలము పాచిగుంట గ్రామమునను కరుణీకము చేసిరి.

ఆముదాల పుల్లూరు నివాసియగు వేలాయుధపిళ్లగారి కుమార్తెయగు మునినాగమ్మగారిని వివాహమాడి సంతానము నిలువక చాలకాలమున కొక పుత్రికనుమాత్రము గాంచిరి. కొంతకాలమునకు భార్యావియోగము కాగా తనకు 16 యేట ఉద్ధవునియొక్క 9 వ శిష్యపరంపరలోఁజేరిన మహానీయునిచే ప్రసాదింపబడిన వేదాంతరహస్య విషయముల నభివృద్ధిచేసికొనుచు అనేక దివ్యక్షేత్రములు సేవించుచు తిరువణ్ణామలై సాధుసంఘమునఁజేరి కొంతకాలముండి పిమ్మట తామార్జించిన జ్ఞానబీజముల భక్తుల మనంబులం బలవంతముగఁ జల్లి పెక్కుమతములందు అనేకశిష్యుల సంపాదించిరి. అనేక

సద్విషయములు బోధించుచు బాధగురువనిపించుకొనక బోధగురువనుకీర్తి నార్జించిరి.

ప్రతివత్సరమును భాగవతపూజారంభమును తిరుమలయందుండు దివ్యతీర్థములయందు శిష్యులతో సభజేరి వ్రతముగానల్పుచుండువారు. వీరి యద్భుతచరిత్ర లెన్నియేనింగలవు

భవ సంవత్సర జ్యేష్ఠాషాఢ మాసములందు కొంత జబ్బుతో నుండిరి. తదుపరి 15 రోజులుముందుగానే తన నిర్యాణసమయము కనుగొని తనకు ఎక్కువ శిష్యులుగలట్టి ప్రేమపూరితమైన రేపల్లెయనదగు యొప్పల్లెయందు 10—7—33 తేది భవ ఆషాఢ బహుళ తృతీయ సోమవారమునాడు బ్రాహ్మీముహూర్తమున శిష్యులజేరదీసిస్నానాదికార్యములుచేసికొని భాగవత, గీతా పారాయణాదులుచేయించి అన్నియు పూర్తియైనదాయని ప్రశ్నించి అయినదను ప్రత్యుత్తరమువిని తాను కొంతపాలుమాత్రము పారణ చేసి సిద్ధాసనమున నుండినట్లేయుండి ఉదయము 6 ఘంటలుకు సిద్ధిపొందిరి. శ్రీ స్వాములవారి శరీరము ఆనందనిలయమున సమాధికావింపఁబడియెను. పూజాదికము, 19—8—37 లో మండలాభిషేకము శిష్యవర్గముచే జరుపబడియెను.

వీరు మహామహులు. అనేక శిష్యగణములను తరింపఁజేసినవారు. వీరి యాత్మకు శాంతిగల్గునట్లు భగవంతుని ప్రార్థించుచున్నాను.

# ఋతు చిహ్నము.

వావిల్ తోటమునిరెడ్డిగారు.

ఋతువనఁగా గర్భగ్రహణమునకు యుక్తకాలమందురు. పదియారు సంవత్సరముల వయసునందు రజస్వలయైన మాత్రముననే గర్భాధానమునకు యుక్తకాలమని తలంపందగదు. రజోదర్శనమగుట ఋతు చిహ్నములలో ముఖ్యమైన చిహ్నముగా నెన్నవలయు. రజోదర్శన దినము మొదలు పదునాఱుదినములు స్త్రీలకు ఋతుకాలము. అందు మొదటి నాలుగు దినములును పంచ పర్వములును షష్ఠివ్యతీపాతము, శ్రాద్ధదివసము వీనిని వర్జించి తక్కిన కాలమందు స్వధర్మపత్నిని బొందవలయు. ఈ మధ్యకాలంబున నిషిద్ధ దినంబుండిన విడువవలయు స్త్రీచే నపేక్షింపఁబడి స్త్రీనిఁ బొందవలయును. కాఁబట్టి స్త్రీ ఋతుమతియై యుండినను బురుషునం దభిలాష పుట్టువఱకు గర్భాధానమునకుం గాలము కాదని తెలియుచున్నది.

ఇంద్రుఁడు తనకు వచ్చిన బ్రహ్మహత్యాదోషములో నొకభాగము స్త్రీలకుంబంచి నప్పుడు స్త్రీలాదోషము నంగీకరించి యింద్రునిఁ గొన్ని వరంబులడిగిరి. ఆవరములలో నొక వరమేదన ఋతుకాలములో బ్రజను పడయుచున్నాము. ఆప్రజమేము కామముతోఁగూడి యుండునపుడు మాత్రము కలుగునట్లు వర మనుగ్రహింపవలయునని స్త్రీలు ఇంద్రునిఁ గూర్చి యడుగఁగ నతఁడు "అగుఁగాక" యని వరమిచ్చెను గనుకనే స్త్రీలు కామయుక్తలయి నపుడు మాత్రము సంతానము గలుగుచున్నది.

పురుషుఁడు స్త్రీని బలవంత పెట్టికవయుటచే బీజము గర్భమందు నిలువదని నిశ్చయమగుచున్నది. శ్రుతులలోను స్మృతులలోను సూత్రములలోను స్త్రీకి రత్యపేక్ష గలిగినపుడు మాత్రము పురుషుండు సంపర్కము చేసినచో గర్భమందు బీజము నిలిచి ఫలప్రదమగునని చెప్పంబడినది. పురుషుండు స్వేచ్ఛానుసారముగా స్త్రీని బలవంత పెట్టి కామాతురుఁడై పొందుటచే ఫలమించుకయు లేదు. అట్లు పురుషుండు విధి నతిక్రమించుటచే స్త్రీ గర్భగ్రహణకాలమందు మాత్రము పురుషు నందపేక్షఁగలుగు స్వభావము చెడి యకాలమందును నతి ప్రబలముగా కామ ముద్రేకమగునట్లు చేయుననుటకు సంశయము లేదు. జంతుజాలములో నయితము స్త్రీమృగ మపేక్షించినపుడే

పురుషమృగమను కూలపడును స్త్రీమృగమనుకూల పడనపుడు పురుషమృగము బలాత్కారము చేయదు. అట్లే మానవజాతియు నుండవలెను.

ఇట్టి కాలంబున నట్లుఁగాక శాస్త్రవిధి నతిక్రమించి ప్రవర్తించుట వలన నల్పసత్వ అల్పాయుష్మంతమగు సంతానము గలుగుచున్నది. దేహములో రోగము ప్రవేశింపగనే సమయమునకు స్వాభావికముగా గావలసినపదార్థములను మితముగా నపేక్షించుటయును నైజముగానే యేకాలమందు విసర్జింపఁదగిన మలాదులను విసర్జించుటకు వలనుపడక కొన్ని పదార్థముల నమితముగా నపేక్షించుటయు బదార్థముల నెంతస్వీకరించినను దృప్తిఁజెందకుండుటయుఁ గొన్ని యావశ్యక పదార్థముల నపేక్షింపకయే యుండుటయు మొదలగు బాధలెట్లు సంభవించునో అట్లులే స్త్రీ పురుషులకుం బరస్పరాపేక్ష సకాలమందు మితముగ గలుగక యకాలమందున మితముగ సంభవించును. ఆయపేక్ష నీడేర్చుకొనుటకు నాకార్య మెంతవిశేషముగా నొనర్చినను దృప్తి జెందదు. తాపజ్వరముగాని దోషజ్వరముగాని సంభవించినవానికి దాహము మితముగాగలిగి యెంత యధికముగా నీరుఁద్రావినను దాహమణఁగకెట్లు వృద్ధియగుచున్నదో యట్లే కామజ్వరముఁ గలిగినవారికి నమిత కామాపేక్షయునందుచే దృప్తిలేమియు సంభవించుచున్నది. ఇవ్విధమున దేహపారిశుద్ధ్యము చెడికామజ్వర రోగముతోనిండిన స్త్రీలపేక్షించునపుడెల్ల బురుషులనుకూల పడగూడదు. పూర్ణారోగ్యముఁగల స్త్రీకి గర్భగ్రహణకాలమందుఁదప్ప పురుషునందు గామము సంభవింపదు. అట్టి స్త్రీ కోరినప్పుడు గర్భగ్రహణమునకు యుక్తకాలమని పురుషుం డనుకూలపడవలయును. పురుషుండు పూర్ణారోగ్యవంతుండుగా నుండెనేని భార్యయందు గర్భగ్రహణకాలమందుఁదప్ప యితరకాలమం దపేక్షింపడు. స్త్రీ తనంతటనే యపేక్షించినంగాని పురుషుండు సంభోగింపకూడదు. అట్లయినపుడు నవరజస్వలలాయపేక్షను సిగ్గువిడచి చెప్పుట యెప్పటికిని దటస్థింపదని కొందరాక్షేపణ జేయవచ్చును. మన పెద్దలకిది తెలిసినవిషయమే. కనుకనే యీ యపేక్షగలిగినపుడు స్త్రీలకుండు చిహ్నములను విశదపఱచి యా చిహ్నములు గలిగినపుడు నిషేకముఁగావింపవలయునని చెప్పియున్నారు. "ఆచిహ్నము లేవన" మిగుల వాడి నిర్మలమైన ముఖమును అదరుచున్న కటి ప్రదేశమును స్తనములును వాలిన నేత్రములును జారిన కడుపునుగల స్త్రీని పురుషాపేక్షఁగల ఋతుమతిగ నెఱుంగవలయును. అట్టి చిహ్నములుఁ గలిగినతోడనే స్త్రీకిఁ బురుషాపేక్ష కలిగినదని నిశ్చయించి గర్భాధానముం జేయవలయును.

పురుషాపేక్ష కలిగినపుడు స్త్రీ కృశించును. రోగముచే కృశించియుండు టను ఋతు సమయముగా దలంపందగదు. గర్భగ్రహణాపేక్షచే కృశించి నదిగా నుండవలెను సాధారణముగా వంధ్యలు కృశించియుండక బాగుగ బలిసియుందురు. ఎచ్చటనైన నరుదుగ కృశించినవారు వంధ్యలుగా నుండ వచ్చును. ప్రాయశః బలసియే యున్నారని తెలియుచున్నది. పుత్రసంతాన మపేక్షించువారు స్త్రీని నియతాహారముచే కృశింపఁ జేయవలయును. సంతానాపేక్ష గలవారు వ్రతోపవాసములు సలుపుట అశ్వత్థ ప్రదక్షిణములొనరించుట నియమంబుల నవలంబించుట మొదలగునవి గర్భధారణకై స్త్రీని కృశింపజేయుట కేర్పఱుపబడినవని తెలియుచున్నది. ఈ పద్ధతియే పశువులందును, వృక్షములందును, ననుసరింపబడుచున్నది. గొడ్డుటావులు మిగుల బలసి బిఱ్ఱయిన శరీరములుగలవిగా నుండును. బిఱ్ఱు విడచి కడుపు జారునట్లుగా కృశింపఁజేయుటకు నాయావును నాగటికిగాని బండికిగాని కట్టిలాగించెదరు. కొన్ని దినములు లాగిన తరువాత నది కృశించుటంజేసి కడుపు వదులగును. అప్పుడది గర్భము ధరించును. వృక్షములు ఫలింపని గొడ్డువిగానుండునపుడు వనపాలకులు వాని వేళ్లు, గాలి తగులుండ తాకుట కనుకూలమగునట్లు త్రవ్వి కొన్ని దినములవఱకు మట్టితో మూయక యట్లనే విడచి నీరు కట్టకుందురు. అందుచే నా చెట్లు వాడి రాలిన యాకులు కలవి యగును. అప్పుడు వానికిందగిన యెఱువును మట్టియుంగలిపిమూసి నీరు కట్టుదురు. తరువాత చెట్టు వికశించి మంచిఫలముల నిచ్చును. ఈకారణమునుబట్టి స్త్రీ కృశించియుండుట ఋతుచిహ్నముగా నెఱుంగవలయును. పూర్వ మార్యులు స్త్రీలతో సంగమించుటకు సత్సంతానమే యుద్దేశ్యముగా గలిగియుండిరి. దేహసుఖమునకుగాను స్వేచ్ఛానుసారముగా విహరించుటకు గాదు.

సంతానమునకుం బక్వమై ఫలవంతమగుటకు యుక్తమగు సమయము విశదముగా దెలియుటకు ననేకచిహ్నములు గనిపెట్టి నిషేకము గావింపవలయునని నిర్ధారణ చేసియున్నారు. గనుక పైచిహ్నములను గనిపెట్టి నిషేక కర్మ చేయుట మంచిది.




# బిక్కిరింత పిదప వెక్కిరింత.

టి. ఆరోగ్యం.

కవరువిప్పి జాబు చదువుకొంటిని. సంతోషముతో "పాపాయీ, చూచినావా, రేపాదివారము కదా మంచిఅదృష్టము నీది" అని అరచినాను.

నాభార్య మొగమంత కన్నులతో నే చదువుచున్న న్యూసు పేపరును అవతలికిత్రోసి "ఏమది?" అని అడిగెను.

"మాయబజారు చూడవలెనని అంగలార్చుచుంటివే. ఇదిగో, పిళ్లెగారు రెండు రిజర్వుడు టిక్కెట్లు పంపినారు."

"అమ్మయ్యా! మొన్నవారు వచ్చినప్పుడు ఈపాడుపిల్ల రాజేశ్వరి తటాలున, అడిగివేసినది. దానినోరును నా చేత మూసిపెట్టినాను కాని ఎట్లో అడిగివేసిన దండీ. కాని, తేది ఏనాడని వేసియున్నారు?"

'రేపే ఆదివారము" పాపాయి మొగము, వెలవెలపోయినది.

"రేపు ఎట్లు వీలగును? రేపు రేడియోలో తనతమ్ముడు పాడుచున్నాడని వసంత మెరీనాబీచికి రమ్మన్నది కాదా. వత్తుమని మాటయిచ్చినాము కదా. పోకున్న ఆమెకడ సడిపడలేమండీ." అని తీర్మానము చేసివేసినది.

నాకు కోపమువచ్చి బండమాట యేదో అన్నాను.

"రామేశ్వరము పోయినా శనేశ్వరము వదలలేదు." అని పాపాయి కంటతడిపెట్టికొనెను.

నాకది కష్టముగ ఉండెను.

"ఏదోసాకుపెట్టి వసంత వారికి సమాధానము చెప్పరాదా?".

"................................"

"పోని ఒకకార్డొత్తి నాకేదో జ్వరము తగిలినది రావీలులేక పోయి

నది క్షేమంపుమని వ్రాసివేసిన రేపుదయము మైలాపూరు చేరును. సంగతి వారికి తెలిసిపోయినదే మరియే చిక్కు లేదు."

"సరి లెండు ఆలాగే చేయవలె" అని పాపాయి బాగు ఆలోచించి గొణిగినది.

*　　　*　　　*　　　*

నేను అఫీసుకు వెళ్ళి సాయంకాలము ఇంటికి మరల వచ్చినాను. పాపాయి కాఫీపట్టుకొని వచ్చినది. ఆమె మొగములోని సంతోషమును చూచి ఏదో గొప్ప విషయముండునని ఊహించి చూడనివానివలె కాఫీ అందుకొని దృష్టికాఫీపైన బెట్టి ఊరకుంటిని.

మీ కార్డు ముక్కని మిగిలిన గండీ! నాఅదృష్టము అనగా నేమను కొన్నారు? ఇంతవరకు వసంతవచ్చి వెళ్ళినది.

పాపము ఆమెమగడు రేపు ఏదో పనిమీద ఊరువిడిచి వెళ్ళుచున్నా డట. రేపు తానుకూడ మెరినాకు వెళ్ళవీలు లేక పోయినదని ఏడిచినది. తమ్ముడు రేడియోలో పాడినానే, విన్నానా? ఏలాగుండెను? "అనిఅడిగిన ఏమి బదులు చెప్పగలను? అని కన్నీరు కార్చి వెళ్ళినది పాపము మీ జబ్బే లాగున్నదో రేపుకబురంపుమన్నది".

"రేడియో ఎవరింటనైనా వినరాదా? మైలాపూరులో ఇప్పుడింటి కొక రేడియో ఉంచుకొన్నారు.

"పోనీ రేపు బయలుదేరు వేళకు మీ ఆడంగి ఆలస్యాలు పెట్టుకోక నీవు రాజేశ్వరి 5 గంటలకు సరిగతయారయి యుండవలెను. తెలిసినదా?"

*　　*　　*　　*　　*　　*

ఫస్టుబెల్ అయినప్పుడే లోపల ప్రవేశించినాము. బ్రాడ్వే టాకీసులో రిజర్వుడు సీట్లకు వెళ్లువారు వేళకుముందేపోయిన నేమి గౌరవము? నేనిది లెక్కపెట్టి చైనా బజారులో పాపాయి మొత్తుకొనుచుండినను బలవంతముగ ఆలస్యము చేయించినాను.

చీకటిలో టార్చిలైటు చూపి కుఱ్ఱవాడు మాకు సీట్లను కనబరచి కూర్చుండుడని వెళ్ళినాడు.

రిజర్వుడులో మేమే అనుకొన్నాము కాని అదివరకే అక్కడ ఇద్దరున్నారు. తెరపై టైటిల్స్ వెళ్లుచుండెను. ఆచీకటి పోయినదే ఇండియా పటము వచ్చెను. అప్పుడు పెద్దవెలుతురు పడి కొంచెముగ హాలును, ప్రక్కన కూర్చున్నవారిని వివరపరచెను. ప్రక్కనున్నవారెవ్వరు?

వసంత, ఆమెమగడు రాజు!! మేమునలుగురు ఒకరినొకరు చూచుకొన్నాము. మా రాజేశ్వరి నాన్నా "అదుగో, వసంతత్త రాజు మామ" అని అరచినది!

మా నలుగురి అవస్థ వర్ణింపనలవి కాకుండెను. చివరకు రాజు నన్ను ఎగదిగచూచి "మీ జ్వరమేలాగున్నదండీ?" అని కుచ్ఛితముగ కన్నుగొట్టి అడిగినాడు.

"నా-నా-న నాకు ఇప్పుడు కొంచెము నిమ్మళించినది." అని నేనేమన్నానో జ్ఞాపకములేదు. తరువాత అతడు వసంత ముసిముసినవ్వులు నవ్వుకొనుచుండగా రోషముకలిగి" నిన్నచాల తీవ్రముగానే జ్వరము తగిలియుండెను. డాక్టరు కృష్ణమూర్తిగారు చాలదిట్టముగ క్వైనా చేర్చి మందిచ్చినారు. నేడు పీడవదలినది." అనిసమర్థించితిని.

"నేడు మధ్యాహ్నము పిళ్లెగారు రెండు టిక్కట్లు పంపినారు. నేటి తేది వేసియుండినందున వృథాగా ఏలపాడు చేయవలెనని ఎట్లో బలవంతపఱచి వీరిని లాగికొనివచ్చి నానిక్కడకు" అని పాపాయి అందుకొని ముక్తాయింపు ఇచ్చెను.

"అయినా, రాజూ, నీవు గ్రామాంతరము వెళ్లెదవని వసంతచెప్పినదటకాదా? పోలేదేల? "అని విసరు నెక్కురింతతో అడిగినాను.

వెంటనే వసంత "వారు బయలు దేరినారు. ఎక్స్‌ప్రెస్ తప్పిపోయినదని మరల ఇంటికి వచ్చివేసినారు. మధ్యాహ్నమగు సరికి మాకు ఒక స్నేహితుడు రెండు రిజర్వుడు టిక్కట్లును పంపినాడు. ఏదో వృథాపోనేల? వానేల చిన్నబుచ్చవలెనని ఇక్కడికి వచ్చినాము." అని వ్యాఖ్యానము చేయసాగెను. "పాపము మీతమ్ముడు..............."

"వానినెట్లో సమాధానము చేయవలెను." అనివసంత తనమగని మొగముచూచెను. రాజు మొగమటు ద్రిప్పికొని తెరవైపుచూచి "శ్రీరంజని శంకరాభరణమును" తతబహుజన్మ లబ్ధసుకృతంబు "అని చేగడ యెత్తుగడలో పాడినది చూచినారా?" అని ప్రస్తావము మార్చెను.

నాకది గొప్ప బరువు తేల్చినట్లయినది.

"ఔను ఆనాడు హార్మోనియం పెంచెలయ్య వాయింపలేదు. ఆ అమ్మాయి తాలూకు నాగమణియో యెవరో వాయించినారు. ఆతని యెత్తుగడ ఆలాగుండెను. అది మీరు గమనించినారా?"

"గమనించినాను: అదా విషయము?"

మేమనుకొన్నంత సంతోషము నాడు మాకు కలుగలేదు. రాజావసంతలు ప్రక్కననుండినది మాకు గుండెలపై బండలవలె బరువుగనుండెను. వారిరువురు కూడ మావలెనే సినిమా పూర్తియగువరకు మావైపే చూచుచు చూడనట్లు నటించుచు ప్రొద్దుపుచ్చినారు. చిక్కిబిక్కిరించి, వెక్కిరింపబడి ఉక్కిరి బిక్కిరిగ ఊపిరాడక ఎట్లో ఆకొంచెముసేపు ఉండి మారాజేశ్వరిపోరు పెట్టుకొన్నదని నెపముపెట్టి వచ్చినప్పుడు వారితో వెడలక వేరే రిక్షాలో ఇల్లువచ్చి చేరినాము. బయలుదేరు నప్పుడు రాజు మరల కన్నుగొట్టినన్ను చూచి "ఏమండీ రాయప్రోలు సుబ్రహ్మణ్యంగా రద్భుతముగ నటించినారు కదా?" అన్నాడు.

"ఔను. అతనికి ఉండిన మంచి పేర్నంతయు..., రాజుగారు మరణించిన తరువాత తీసివేసి వారతు పాపము లేకుండిన ఆతనితో సమానముగ సంగీత సాహిత్య నాట్యాచార్యాలలో అడుగుపెట్టు వారేలేరు" అని ఇంకనేదో అనినట్లు జ్ఞాపకము.

* * * *

నాలుగైదు దినములైయుండును, ఒకనాడు పిళ్లెగారు ఆఫీసునకు వచ్చినారు.

"మీరంపిన టిక్కెట్లవలన మాపాపాయి, నేను సంతోషముగ ఒక్క దినమంతయును గడపినాము. చాల సంతోషమండీ పిక్చరేదో సుమారుగనున్నది.

"ఆహా! బాగానే చూచియుందురు పోనిత్తురుగానీ రాజుగారు ఏమన్నారు?"

నేనతని నెగదిగ చూచి నక్కినోరు వైచితిని.

"మీకేలాగు తెలిసినది వారుకూడ వచ్చినారని?"

పిళ్లె తన చెక్కపండ్ల నిగిలించినాడు. "ఎవ్వరు చెప్పవలెను? మీకు పంపినట్లే టిక్కెట్లను రాజుగారికి కూడపంపితిని. తమాషాకని ఈసంగతి మీకు ప్రత్యేకముగ చెప్పలేదు. ఏమి, మంచి వేడుక జరిగినదా? చెప్పండి".

"వేడుకా? ప్రహసనము!"

"అబ్బ ఎంతపోకిరి పని చేసినారు మీరు?"

# Tenugu Talli Mathamatical Puzzle No. 1.

**Good luck ! Rs. 20 must be won. Try & get !!**

**Entrance fee per entry Annas 4 only.**

**Last date of receipt 10th December 1937.**

**Results in Tenugu Talli of Jan. 1938 issue.**

FILL IN THIS COUPON

| | | | |
|---|---|---|---|
| | | | |
| | | | |
| | | | |
| | | | |

Arrange the numbers from 1 to 30 (both inclusive) in the given square such that, each row, column & diagonals total up 62. Each number should be used only once. Prize amount will be divided equally in case of ties. Correct solution is the one which agrees with the sealed key solution.

N. B:—Tenugu Talli, will be sent free of cost for 1 year to all competitors who send four or more entries, at one time whether their solutions agree with the sealed key solution or not, provided they make up 62 any how, without repetition of said numbers. The entrance fee in case of a single entry, should be sent through Postal or Money Orders. Stamps must be enclosed for all correspondence. The Manager's decision is final & legally binding.

All Communications to:-

*The Manager,*
**TENUGU TALLI,**
**(Puzzle Department,)**
***P. O. Chittoor.***

# తెనుఁగుతల్లి పోటీపరీక్ష నెం. 1.

**మంచియదృష్టము! 20 రూ బహుమతి. ప్రయత్నింపుఁడు!!**

ప్రవేశపు రుసుము ఒక్కొక్కటికి నాలుగు అణాలు.

ఉత్తరములు చేరవలసిన కడపటిదినము 10—12—1937.

ఫలితములు 1938 జనవరి తెనుఁగుతల్లిలో ప్రకటింపఁబడును.

| | | | |
|---|---|---|---|
| | | | |
| | | | |
| | | | |
| | | | |

### పద్ధతి.

ఈ పదునాఱు చదరపు గదులలో 1 నుండి 30 వఱకుఁగల అంకెలు, వేసినయంకె మరల వేయక, పూరించుచురావలయును. క్రిందికి పైకిని, ప్రక్కలకును, మూలలకును, కూడిన 62 రావలయును.

ఉత్తరములన్నియు తెనుఁగుతల్లి పోటీపరీక్ష నెం. 1 అను శీర్షిక యుండు ఈ పత్రములలోనే యుండవలయును. పై నియమములకు లోబడి, 62 సంఖ్య వచ్చు ఉత్తరములు (entries) ఒకసారిగా నాలుగుగాని, అంతకంటె ఎక్కువగాని పంపువారికి తెనుఁగుతల్లి పత్రిక ఒక సంవత్సరము ఉచితముగా పంపఁబడును.

సీలుచేయఁబడిన ఉత్తరములోనున్న ప్రకారము పెక్కుండ్రు పంపినచో బహుమతి సమముగ పంచిపెట్టబడును. ప్రవేశపు రుసుము తపాలు ఆర్డరుగాగాని మణియార్డరుగాగాని పంపవచ్చును.

ఉత్తరప్రత్యుత్తరములు జరుపఁగోరువారు తపాలు బిళ్లలు పంపవలయును. మానేజరు చేయు పరిష్కారమే కడపటిది.

మానేజరు,
తెనుఁగుతల్లి ఆఫీసు,
(పోటీపరీక్ష శాఖ,) చిత్తూరు.

# కర్షక ప్రబోధము.

బూదూరు రామానుజులు రెడ్డిగారు.

చెమటనోడిచికష్ట జీవనంబొనరించు
    చున్నచో కంటకంబయ్యె నీకు
ములుగఱ్ఱబట్టి నాగలిదున్నకొనుచున్న
    యవమాన భాజనంబయ్యెనీకు
గ్రామసీమలలోని కాపురంబన్నచో
    తీరనిదుఃఖంబు దెచ్చెనీకు
పల్లెటూరులలోని పద్ధతుల్ గమనింప
    హేయంబుగా గోచరించెనీకు

కటకటా దురదృష్టంబు కతన నేమొ।
వ్యావసాయిక జీవిత పథమునందు।
సంచరింపఁగ వెగటుపుట్టించెనీకు।
కర్షకా! కర్షకా! యేమికాలమహిమొ॥

కలధనంబువ్యయంబు గావించుచుంటయే
    విద్యుక్తమనుచు భావించినావు
పట్టణంబులకేగఁ బ్రాకుచునుంటయే
    తగినగౌరవమని తలఁచినావు
దుండగీండ్రహితంబు తోఁ ద్రిమ్మరుటజన్మ
    సాఫల్యమనియెంచ సాగినావు
స్థానికసంస్థలలోన కాలిడుటయే
    మర్యాదయని ప్రాలుమాలినావు

కపటనాగరికంబుతో కలసిమెలసి।
భ్రష్టమతివౌచు పెడదారిఁబట్టినావు।
పూర్వవైభవమునె తలపోయవీవు।
కర్షకా! కర్షకా! నీదుకర్మమేమొ॥

ఆర్థికవిప్లవం బొనాఁటికానాఁటి
కిబ్బడిగా విజృంభించుచుండె
తలవిప్పుకొని గర్భదారిద్రదేవత
స్వైరవిహారమ్ము సలుపుచుండె
పైపెచ్చు పన్నులబాధ యెంతయుమించి
తీరనిచిక్కులఁ దెచ్చుచుండె
పరపత్తి మింటైన దొరకక యప్పుల
యొత్తిడుల్ మనుగడ నొంబడయుచుండె

దేశకాలస్థితులు గూడ దినదినంబు
మించినీకథ గతినిగళించుచుండె
కర్షకా! నేటికైనను కనులు దెఱచి
సరభసంబున నింటికిమగలుపోయి

ప్రకృతిరామణీయకమైనపల్లెటూరి
కాపురమె నీకు పరమసుఖప్రదంబు
కృషికజీవనమది యెంతయోనిప్రియము
కర్షకా! లెమ్ము పల్లెకుకదలిపొమ్ము

ప్రకృతిశోభరహించు వనములఁదిరుగక
క్లబ్బులలోనఁ జీట్లాడమరఁగి
కర్షకత్వముసేద్యగాండ్రకువీడి, యు
ద్యోగుల వెనువెంట నేగమరఁగి
దేశంబుజాతిని దెలుపుచిన్నెలవీడి
యాంగ్లవేషంబు వేయంగమరఁగి
కమ్మని యంబలి గంజి ద్రావుట రోసి
బ్రాందిసీసాల సేవనముమరఁగి

పురజనావళి యారోగ్యమునుగడింప
బల్లెలకు నేగుచుండగా బ్రదుకువిడిచి
పురములకుఁ బ్రాఁకులాడెదు పరువువీడి
కర్షకా! లెమ్ము పల్లెకుఁగదలిపొమ్ము

# నెలదినములు

### వెంకటగిరిరాజాగారి పట్టాభిషేకము.

శ్రీ శ్రీ శ్రీ రాజా వెలుగోటి సర్వజ్ఞ కుమార కృష్ణయాచేంద్ర బహదరు పంచహజార్ మన్సబ్‌గారు శ్రీ వేంకటగిరి రాజాగారు అక్టోబరు నెల 14-వ తేది (విజయదశమి) మధ్యాహ్నము 12 గంటలకు పట్టాభిషిక్తులయిరి. పట్టాభిషేక కార్యానుక్రమణిక ననుసరించి ఆయాయుత్సవములు అతి వైభవముగా జరుపఁబడెను.

ఈ సందర్భమున రాజాసాహెబువారు సంస్థానమునకు రైతులు బాకీపడియుండు శిస్తు డిక్రీలలో మూడులక్షల రూపాయలు త్రోసివేయుదుమని వాగ్దానముచేసిరి. అనుతోటం శిస్తురేట్లను నూటికి 50 వంతునను, పసుపుపైరుల శిస్తురేట్లను నూటికి 40 వంతునను తగ్గింతుమని చెప్పిరి. హరిజనులకు డిక్రీబాకీలలో నూటికి, 50 వంతులు తగ్గించెదమనియు, వెంకటగిరి హైస్కూలులోను, నెల్లూరు హైస్కూలు కాలేజీలలోను హరిజనులు జీతములు లేకుండ చదువుకొనుటకు దగిన యేర్పాట్లు చేయుదుమనియు వక్కాణించిరి.

### మైసూరులో అరెస్టులు.

మైసూరు అసెంబ్లీ సభ్యుఁడును, మైసూరు కాంగ్రెసుసంఘ నియంతయు నగు శ్రీ కె. టి. భాష్యం అయ్యంగారిని మరియొక కాంగ్రెసు వాదియగు తిమ్మారెడ్డిగారిని మైసూరు పోలీసువారు రాజద్రోహపు నేరమునకై అరెస్టుచేసిరి. మరల బొంబాయినుండి వచ్చిన కె. ఎఫ్ నారిమన్‌గారిని అరెస్టుచేసిరి కాని వెంటనే వదలివేసి వారిని మదరాసునకు పంపివైచిరి.

### చైనా-జపాను యుద్ధము:—

చైనా జపానుయుద్ధము తీవ్రముగనే సాగుచున్నది కాని యీ

నడుమవచ్చిన వార్తలు చైనాయెడ సానుభూతిచూపువారికి యుత్సాహకరములుగనున్నవి. చైనావారు, జపానుదాడిని ప్రతిఘటించి నిలుచుటయేకాక కొన్నిచోట్ల జపానువారిని చాల వరకు వెనుకకుతరుమగలిగిరి. అంతేగాక, 40000 మంది జపాను సైనికులు ఉన్న ప్రదేశమునకు చుట్టునుగల ప్రదేశమును చైనావారు ఆక్రమించుకొనిరి. ఈ 40000 మందియును చైనావారిని తప్పించుకొని బయటుపడుట కష్టమేను. అంతేగాక ఇన్నాళ్లు తటస్థముగనుండిన చైనా రెడ్ సైనికదళముకూడ, చైనారి పబ్లిక్ సైనికులతో చేరుటవలన చైనావారికి మరింతయుత్సాహముగనున్నది. జపానువారు విషవాయువును యుపయోగించుచున్నారనియు అందువలన చాలమంది సైనికులు చనిపోవుచున్నారనియు చైనాఅధ్యక్షుని భార్య వ్రాయుచున్నది.

## ఇటలీ:—

అబిస్సీనియాలోనున్న ఇటాలియను ఆఫీసరులకు యెదురుతిరిగి అబిస్సీనియనులు 38 మంది ఇటాలియను ఆఫీసరులను చంపివేసిరి.

ఇటలీయందు ఫాసియిజమునకు వ్యతిరేకప్రచారము చేయుచున్నందుకు చాలమందికి కఠినశిక్షల విధింపబడినవి.

యుద్ధమువలన చాలవరకు పాడైన అడిస్ అబాబా నగరమును పునర్నిర్మించుకొనుట మాని వేసినట్లు ముసోని తెలుపుచున్నాడు.

## స్పెయిను:—

స్పెయిను అంతర్యుద్ధముకూడ యింకను జరుగుచునే యున్నది. ప్రభుత్వకార్యస్థానము మాడ్రిడ్‌నుండి బార్సిలోనా నగరమునకు మార్చబడినది.

సాలమాంకావద్దనున్న విద్రోహులను వెళ్లగొట్టుటకు ప్రభుత్వసైనికులు చేసిన ప్రయత్నములు వ్యర్థమాయెను. విద్రోహపక్షమువారే జయమును పొందిరి.

స్పెయినునుండి ఇటాలియను వాలంటీర్లు వెళ్లినచో విద్రోహుల బలము చాలవరకు తగ్గవచ్చును.

## తాటస్థ్యసంఘ సమావేశము.—

స్పెయినునందు వాలంటీర్లుగ పనిచేయుచు విద్రోహులకు పనిచేయుచున్న ఇటాలియను సైనికులను రప్పించి వేయవలయునని ఇటలీపై బట్టు

పట్టి యీ సంఘమువారు కోరుచున్నారు. ఈసమావేశమునకు జర్మనీ, ఇటలీ, ఫ్రాన్సు, ఇంగ్లండు దేశముల ప్రతినిధులు హాజరయిరి. ఇది లండను నగరమున జరుగుచున్నది. వాలంంటీర్లను రప్పించుటకు ఇటలీ ప్రభుత్వము వారు మొదట కొంచెము సంధిగ్ధావస్థను కలిగించిరి కాని చివరకు అంగీకరించినట్లే వార్తలవలన తెలియుచున్నది.

## తొమ్మిదిరాజ్యముల సమావేశము:—

ప్రపంచ శాంతినిగురించి ఆలోచించి అవసరమగు విధమున తీర్మానించుటకు తొమ్మిదిరాజ్యముల సమావేశమును ఇంగ్లండు, ఫ్రాన్సుప్రభుత్వములవారు యేర్పాటుచేయుచున్నారు. ఈసమావేశమునకు హాజరుకావలయునని ఇటలీ, జర్మనీ, ప్రభుత్వములవారికి గూడ ఆహ్వానములు పంపబడినవి. ఈసమావేశము బెల్జియందేశ రాజధానియగు బ్రస్సెల్సునగరమున జరుగును. ఇందుకు అవసరమగు యేర్పాట్లన్నియు బెల్జియం ప్రభుత్వమువారే చేయుదురు. ఈ సమావేశమున ప్రప్రథమమున చైనా-జపాను యుద్ధమును గూర్చి చర్చలుజరగును ఈసమావేశమునకు ఇటలీ, జర్మనీ, అమెరికా దేశముల ప్రభుత్వప్రతినిధులు వెళ్లెదరు. జపానువారు తమప్రతినిధి పంపుదురని నమ్ముటకు వీలులేదు. చైనాప్రభుత్వ ప్రతినిధి మాత్రము తప్పక హాజరగును.

## పాలస్టయిను:—

పాలస్టయినునందు అల్లరులు యింకను జరుగుచునేయున్నవి. అరబ్బునాయకులను ఎంతోమందిని ప్రభుత్వమువారు జైలునందుంచినారు జెరుసలేమునగరమునందంతటను పోలీసు రిజర్వుదళములు కాపలా గాయుచున్నారు. అరబ్బుమతనాయకులగు 'గ్రాండ్ ముఫ్తి' జెరుసలేమునుండి తప్పించుకొని పారిపోయెను. లిబయాలోని అరబ్బులు కూడ, పాలస్టయిను అరబ్బులతో సహకారముచూపెదమని ముసోలినికి టెలిగ్రాము పంపినారు. ఇటీవలవార్తలనుబట్టి పాలస్టయినునందు కొంతవరకు అలజడితగ్గినదని తెలియుచున్నది కాని, మిలిటరీదళములవారు మాత్రము, అరబ్బులయిండ్లనుతగులబెట్టి వారిని నానాహింసల పాలుచేయు చున్నారు. జెరుసలేమునందు కాపురమున్న అబిస్సీనియా దేశీయులందరును లండనునకు వెళ్లిపోవుచున్నారు.

# ఆరోగ్య విజ్ఞానము.

మధుమేహరోగులు నిస్సందేహముగను నిరపాయముగాను పుచ్చుకో తగిన మధురపదార్థము తేనె ఒక్కటే.

... ... ...

పసుపులోనికి సేవించిన పిత్తాశయమునకు మాంద్యముపోగొట్టి చురుకు తెచ్చును.

... ... ...

తవుడులో విటమిన్ బి విస్తరించియున్నది.

... ... ...

భోజనము చేయుచు వాగ్వాదము చేసినను, కోపపడుట వలనను అన్నము జీర్ణముకాదు.

... ... ...

భోజనశాలలో ఎఱుపురంగుల వస్తువులు విస్తారముగనుంచకూడదు. ఎఱుపు ఉద్రేకమును పుట్టించును.

... ... ...

ఉద్రేకమును తగ్గించుటలో నీలవర్ణము బహు సమర్థమైనది.

... ... ...

ఊదారంగు తపస్సునకు మంచిది.

... ... ...

ఏకాగ్రచిత్తమును కలిగించుటకు పసుపురంగు ప్రధానమైనది.

... ... ...

శరీరమునందలి విషపదార్థాలను తొలగించుటకు ఫలరసమునకు మించిన మందు మరియొకటి లేదు.

... ... ...

పాలకంటె కూడ నారింజరసములో ఎక్కువ శరీరపోషకగుణమున్నది.

... ... ...

ఉప్పు నీళ్ళలో కరిగించి ఆనీళ్ళతో పండ్లుతోమిన అవి శుభ్రపడుటయేకాక చిగుళ్లు గట్టిపడును.

... ... ...

వంటలో ఏ పదార్థమునైనను త్వరలో ఉడికించవలెనుగాని చాలాసేపు ఉడికించకూడదు.

# లోకజ్ఞానము.

ప్రపంచములో సరఫరా అగు తేయాకులో సగభాగము హిందూదేశములోనే తయారు అగుచున్నది.

.... .... ....

న్యూయార్కులోని గ్రాండు సెంట్రల్ టెర్మినల్ అను రయిలు స్టేషన్ ప్రపంచములోని అన్ని స్టేషన్‌లలో పెద్దది. ఆ స్టేషన్‌కు 47 ప్లాటుఫారాలు ఉన్నవి.

.... .... ....

వెలుతురు సెకండుకు 186,000 మైళ్లు ప్రయాణముచేయును.

.... .... ....

రేడియో 1902 సం॥ లో కనుగొనబడినది.

.... .... ....

బట్టలుకుట్టెడు యంత్రమును 1830 లో థిమోనీర్ అను ఫ్రెంచివాడు కనుగొనున్నాడు.

.... .... ....

అప్పుడు పుట్టిన బిడ్డ సాధారణముగ ఇరవై అంగుళముల పొడుగు, ఏడుపౌనుల బరువు ఉండును.

.... .... ....

ఆంగ్లభాషయొక్క నిఘంటువులలో మిక్కిలి పెద్దదైన ఆక్స్ఫర్డు డిక్షనరీలో 5,00,000 పదాలకు అర్థాలు వివరింపబడ్డవి.

.... .... ....

అన్ని ఆకులకు గాలి, వెలుతురు బాగుగా తగులుట కొఱకే చెట్లు మత కొమ్మలను ప్రక్కలకు పెంచును.

.... .... ....

గ్రంథకర్తలు, నటకులు, ఉపాధ్యాయులు, ఎంజనీర్లు, డాక్టర్లు వీరు సాధారణముగా మిక్కిలి పొడుగుగా ఉండెదరు. ఫ్యాక్టరీకూలీలు, రోడ్డు (కూలీలు మిక్కిలి పొట్టిగావుంటారు.?)

.... .... ....

హిందూదేశములో ఎద్దులుచేయుపని, ఆవులు ఇచ్చుపాలు, రెండు కలిసి ఇచ్చుపెంట ఎఱువు రూపాయలలో విలువకట్టిన ఏడాదికి 1300 కోట్లు ఉండునని అంచనా వేయబడ్డది.

## నవంబరునెల [illegible]గము ఆశ్వయుజ కార్తికములు.

| ఇం. | | అఙ. | యోగ. | వా. | తిథి గం.ని. | నక్ష. గం. ని. | |
|---|---|---|---|---|---|---|---|
| 1 | | 16 | సి | సో | త్ర ఉ 6-30 | హ ఉ 11-7 | నరకచతుర్దశి |
| 2 | | 17 | సి | మం | చ ఉ 7-16 | చి ప 12-31 | దీపావళి, గౌరీవ్రతము |
| 3 | భావనామ ఆశ్వయుజ బ. | 18 | సి | బు | ● ఉ 8-26 | స్వా సా 2-20 | |
| 4 | | 19 | మ | గు | ప్ర ఉ 10-4 | వి సా 4-35 | |
| 5 | | 20 | అ | శు | ద్వి ప 12-0 | అనూ రా 7-0 | |
| 6 | | 21 | సి | శ | తృ ప 2-8 | జ్యే రా 9-40 | విశాఖకార్తె ఉ 8-36 |
| 7 | | 22 | అ | ఆ | చ సా 4-16 | మూ రా 12-15 | నాగులచవితి |
| 8 | | 23 | సి | సో | పం సా 6-14 | పూషా రా 2-39 | |
| 9 | | 24 | అ | మం | ష రా 7-52 | ఉషా రా 4-40 | |
| 10 | | 25 | సి | బు | స రా 9-7 | శని పూర్తి | |
| 11 | | 26 | సి | గు | అ రా 9-50 | శ్ర ఉ 6-13 | |
| 12 | | 27 | సి మ | శు | న రా 10-4 | ధ ఉ 7-18 | |
| 13 | | 28 | అ మ | శ | ద రా 9-49 | శ ఉ 7-55 | |
| 14 | | 29 | సి అ | ఆ | ఏ రా 9-0 | పూభా ఉ 8-2 | |
| 15 | | 30 | సి అ | సో | ద్వా రా 7-49 | ఉభా ఉ 7-44 | క్షీరాబ్ధి ద్వాదశి |
| 16 | | 1 | సి అ | మం | త్ర సా 6-12 | రే ఉ 6-59 | |
| 17 | | 2 | సి | బు | చ సా 4-24 | భ రా 4-39 | |
| 18 | | 3 | సి | గు | ○ ప 2-11 | కృ రా 3-5 | కృత్తికాదీపము |
| 19 | | 4 | మ | శు | ప్ర ప 11-54 | రో రా 1-31 | అనురాధకార్తె |
| 20 | భావనామ కార్తిక శు. | 5 | సి | శ | ద్వి ఉ 9-32 | మృ రా 11-43 | |
| 21 | | 6 | సి | ఆది | తృ ఉ 7-9 }<br>చ రా 4-49 } | ఆ రా 10-6 | |
| 22 | | 7 | అ | సో | పం రా 2-43 | పున రా 8-38 | |
| 23 | | 8 | సి | మం | ష రా 12-49 | పు రా 7-22 | |
| 24 | | 9 | సి | బు | స రా 11-19 | ఆ సా 6-25 | |
| 25 | | 10 | అ | గు | అ రా 10-6 | మ సా 5-49 | |
| 26 | | 11 | సి | శు | న రా 9-24 | పు సా 5-38 | |
| 27 | | 12 | మ | శ | ద రా 9-8 | ఉ సా 5.53 | |
| 28 | | 13 | అ | ఆ | ఏ రా 9-25 | హ సా 6-40 | |
| 29 | | 14 | సి | సో | ద్వా రా 10-11 | చి రా 7-55 | |
| 30 | | 15 | సి | మం | త్ర రా 11-29 | స్వా రా 9-41 | |

# తెనుఁగుతల్లి.

సంస్థాపకులు:

వి. సి. రాజారెడ్డిగారు, వల్లివేడు.

సంస్కారకులు :—

శ్రీయుత. ఈ. వేంకటరావుగారు,

వేంకటరామ అండుకో అధికారులు, ఏలూరు.

సభ్యులు :—

శ్రీయుత. C. అణ్ణామలై పిళ్లగారు, పలమనేరు.
,, G. రామలింగారెడ్డిగారు, గుండ్లపల్లి.
,, N. చెంగల్ రెడ్డిగారు, మండీ, పాకాల.
,, M. V. షేక్ ముహమ్మద్ రావుతర్ గారు, పాకాల.
,, N. రంగయ్యనాయఁడుగారు, మండీ, పాకాల.
,, S. దొరసామిసెట్టిగారు, గాజులమండీ, చిత్తూరు.
,, P. రంగస్వామిగారు, బి. ఏ., తిరుమల.
,, సి. రామచంద్రారెడ్డిగారు, కత్తిరపల్లె, పళ్ళిపట్టు.
,, డి. మునిరత్నం నాయడుగారు, వేలంజేరి.
,, పి. గోపాలరెడ్డిగారు, నెమ్మలి.
,, Dr. P. మునిరత్నంపిళ్లెగారు, L. M. P. చిత్తూరు.

# బ్యూటిలిస్

## బ్యూటిలిస్ తుషారము. (స్నో)

చందనచర్చకంటెను, ఉశీరశైత్యోపచారమునకంటెను, మంద మంద మలయమారుతవీచికలకంటెను, అత్యంతశైత్యదాయకమును మంజుళ మనోజ్ఞ సురభిళోపేతమునైన మా "బ్యూటిలిస్ స్నో" (తుషారము) ను వాడిచూడుండు!

చెమటకాయలు, ఎండపొక్కులుగల చర్మముపై రాచిన పదినిమిష ములలో మంటలు మాయమై సంపూర్ణోపశాంతి చేకూర్చును. మొటిమల మాడ్చి, ముఖమునకు సౌందర్యము నొసగును.

## బ్యూటిలిస్ నవనీతము (క్రీం).

క్షౌరానంతరము, రాత్రులందు నిదురింపబోవు నప్పుడును రాచి కొనినచో ఎట్టి బిరుసుబారి ఎండిపోయిన చర్మమునకు గూడ మార్దవమును మెఱుగును కలిగించును.

ఇవి అన్ని అంగళ్లయందునులభ్యమగును. బ్యూటిలిస్ గుఱుతుగల వివిధము లైన సువాసన ద్రవ్యములన్నియు ఉత్తమ తరగతికి జెందినవి. ఒక్కపర్యా యము వాడిచూచిన మీకే తెలియగలదు.

**టాయిలెట్స్ మాన్యుఫాక్చరిజ్ కంపెని,**
**లిమిటెడ్.,**
చిత్తూరు.